భారత
కమ్యూనిస్టు
పార్టీ
(మార్క్సిస్టు)

అధ్యయన బృందం నివేదిక

# పట్టణ సమస్యలు – మధ్యతరగతి

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

2011 జనాభా లెక్కల ప్రకారం మన దేశంలోని పట్టణ జనాభా, మొత్తం జనాభాలో 32 శాతంగా వున్నారు. మొట్టమొదటిసారిగా పట్టణ జనాభా పెరుగుదల రేటు గ్రామీణ జనాభాకన్నా ఎక్కువగా వున్నది. 1971–81 దశకంలో పట్టణీకరణ పెరుగుదల రేటు ప్రభుత్వ రంగ విస్తరణకు దోహదపడింది. తరువాత 2001లో మరోసారి పెరుగుదల నమోదైంది. గ్రామాల నుంచి వలసలు రావటం, శివారు ప్రాంతాలు పట్టణాలలో కలసిపోవటం అనేవి పట్టణ జనాభా పెరుగుదలకు దోహదపడిన ప్రధానాంశాలు. కానీ చైనా అనుభవంతో పోల్చుకుంటే మన దేశంలో పట్టణీకరణ యిప్పటికీ తక్కువగానే వున్నదని చెప్పాలి. పట్టణాల పెరుగుదలకు కారణాలు యీ కింది విధంగా వున్నాయి:

***– వ్యవసాయం గిట్టుబాటు కాకపోవటంతో గ్రామసీమల్లోని యువతీయువకులు మెరుగైన అవకాశాల కోసం పట్టణ ప్రాంతాలకు వలసపోతున్నారు. ధనిక రైతుల్లోని ఒక భాగం వ్యవసాయాన్ని విడిచిపెట్టి వ్యాపారార్థం పట్టణాలకు తరలుతున్నది. ఇదేవిధంగా గ్రామీణ సంపన్నులు కొందరు తమ పిల్లలకు మంచి చదువులు కావాలన్న అభిలాషతో పట్టణాలకు మారుతున్నారు.***

***– గ్రామాల్లోని ధనిక, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లలు పట్టణాలలోని ఇంగ్లీషు మీడియం పాఠశాలలకు హాజరవుతున్నారు. దీనివల్ల బాల్యం నుంచే పట్టణ జీవితానికి అలవాటుపడుతున్నారు.***

***– వ్యవసాయంలో ఉపాధి అవకాశాలు తగ్గటంతో వ్యవసాయ కార్మికులు కూడా పెద్ద సంఖ్యలో పట్టణాలకు వలసపోతున్నారు.***

***– దళితులైన వారు అత్యాచారాల నుండి, వివక్షతల నుండి తప్పించుకునేందుకై సాపేక్షకంగా చూస్తే ఎక్కువ రక్షణ వుండే పట్టణాలకు తరలివెళ్తున్నారు.***

***విస్తరించిన నగరాలు–పట్టణాలు***

1951 నుంచి 2001 వరకు నడచిన మధ్య కాలంలో మొత్తంమీద పట్టణాలు, నగరాలు 2125కు పెరిగాయి. ఈ సంఖ్య 2001–2011 మధ్య కాలంలో 2771కి పెరిగింది. జనాభా లెక్కల నిర్వచనంలో వచ్చిన మార్పులు కూడా అమితంగా కనిపించే యీ పెరుగుదలకు ఒక కారణమని చెప్పాలి. మొత్తం జిడిపీలో పట్టణ ప్రాంత వాటా కూడా నికరంగా పెరుగుతూ ప్రస్తుతం 60 శాతానికి చేరింది. పట్టణాలంటే పాలనకు, ఉపాధికి, రాజకీయాలకు కేంద్రాలు. అంటే, ఆందోళనలకు, ప్రజా వుద్యమాలకు కేంద్రాలుగా మారుతున్నాయన్నమాట. అభివృద్ధి, సంపద, సదుపాయాలు పట్టణాలలో

కేంద్రీకృతమవుతున్నాయి. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలలో పెట్టుబడులు పెడుతుండటంతో ప్రాథమిక సదుపాయాలు కూడా వూపందుకున్నాయి. మురికివాడలు, బస్తీలు ఏకకాలంలో పుట్టుకు వస్తున్నాయి. అన్ని కులాలకు, మతాలకు చెందిన పట్టణ ధనికులు పాత బస్తీల నుంచి పట్టణ శివారులకు, పరిసర ప్రాంతాలకు వెళ్తున్నారు. నిర్లక్ష్యం కారణంగా పాత బస్తీలు యాతనల పాలవుతున్నాయి. పట్టణాభివృద్ధి క్రమం పేదలను, మధ్యతరగతిని, వెనుకబడిన సామాజిక బృందాలను మినహాయిస్తున్నది.

కొత్త సమస్యలు తలెత్తుతున్నాయి. ఇళ్ళకొరత చాలా ఎక్కువగా వున్నది. ఒక అంచనా ప్రకారం రెండు కోట్ల ఇళ్ళు కొరతగా వున్నాయి. కాని ప్రధానమైన యీ సమస్యను పక్కన పెట్టిన ప్రభుత్వం, ఆకర్షణీయమైన 100 పట్టణాలను నిర్మిస్తామని చెప్తూ యిందుకోసం యిటీవలి బడ్జెట్‌లో రూ.7,000 కోట్లను కేటాయించింది. ఈ పథకానికి కావలసిన నిధుల సేకరణకుగాను పన్నుల విధింపుకు భూమికను సిద్ధం చేసింది.

***పట్టణ సంస్కరణలు***

నయా వుదారవాద పాలన త్వరితగతిని పురోగమించటానికిగాను పట్టణీకరణ అత్యంత ప్రధానమైన అంశంగా పాలక పార్టీలు చెప్తున్నాయి. ఒకవైపున పట్టణాభివృద్ధి కోసం మరిన్ని నిధులను కేటాయిస్తూ, మరోవైపున వినియోగ ఛార్జీలు విధింపు, సబ్సిడీలను తొలగించి ఆ స్థానంలో రుణాలను ప్రవేశపెట్టటం ద్వారా అంతంత మాత్రంగా బతుకుతున్న పట్టణ ప్రజానీకంపై బృహత్తర భారాలను మోపుతున్నది. అయితే, యిదంతా 'అభివృద్ధి' పేరున సాగుతున్నది. 'ప్రజల భాగస్వామ్యం' పేరుతో మురికివాడల్లో బృందాలను ఏర్పాటు చేసి జెఎన్ఎన్‌యుఆర్ఎం, పియుఆర్ఏ, పిపిపిల పేరుతో రకరకాలైన 'సంస్కరణలను' చేపడుతున్నది. మురికివాడల అభివృద్ధి అనేది పెద్దయెత్తున మురికివాడ వాసులను వెళ్ళగొట్టటానికే దారితీస్తున్నది. మధ్యతరగతి ప్రజలు నివసించే ప్రాంతాలలో వినియోగ ఛార్జీల వసూళ్ళ కోసం నివాస సంక్షేమ సమాఖ్యలను (ఆర్‌డబ్ల్యుఏ) వినియోగిస్తున్నారు.

పట్టణ భూపరిమితి చట్టాలను వినియోగించుకుని పరిసర గ్రామాలను పట్టణంలో కలిపి వేస్తున్నారు. పెద్దయెత్తున పెట్టుబడులను, సట్టావ్యాపార పెట్టుబడులను ఆకర్షించే రియల్ ఎస్టేట్ వూపందుకోవాలంటే యిది ఎంతో అవసరం. దీని ఫలితమేమంటే భూమి ధరలు యిప్పుడు మధ్యతరగతికి కూడా అందుబాటులో లేకుండా పోయాయి.

సంస్కరణల క్రమం ఫలితాలు నిరసన ప్రదర్శనలకు అవసరమైన స్థలాన్ని కూడా లేకుండా కుదించి వేశాయి. ఈ నిరసనలు సంస్కరణల కారణంగా పుట్టుకువచ్చి

వాటికి వ్యతిరేకంగా జరిగేవే. నిరసనలకు వుద్దేశించిన స్థలం విశాలత రీత్యా సరిపోక పోవటమేకాక, అగోచరమైన లేదా తేలికగా అందుబాటులోకి రాని చోట్లు కేటాయించారు. ఇలాంటి స్థలాలను 'ధర్నా చౌక్‌లు' తదితర పేరులతో పిలిచినప్పటికీ యిక్కడ నిర్వహించే ప్రదర్శనలు ప్రజలపై పెద్దగా ప్రభావాన్ని చూపలేవు. ప్రజావెల్లువ పొంగినపుడు మాత్రమే నిరసన ప్రదర్శనలు జరిపే స్థలాలపై వున్న ఆంక్షలు బద్దలు అవుతాయి.

ఈ పట్టణ సంస్కరణలు నిరుపేదలను, మధ్య తరగతిలోని పేదలను తీవ్రంగా దెబ్బతీశాయి. అయితే యీ సంస్కరణలను ఎగువ మధ్య తరగతికి చెందిన వారు బలంగా సమర్థిస్తున్నారు.

### *పార్టీ కార్యక్రమంలో అవగాహన*

నయా వుదారవాద విధానాల అమలు మధ్యతరగతికి చెందిన వివిధ కేటగిరీలలో పురోగతికి చెప్పుకోదగిన విధంగా దారితీసింది. 1964 నాటి మన కార్యక్రమం మధ్యతరగతి గురించి ఒక అంచనాకు వచ్చింది, కాగా యీ తరగతిలో వచ్చిన మార్పులను 2000లలో తాజాపరచిన కార్యక్రమం పేర్కొన్నది. అది యీ విధంగా పేర్కొన్నది. "పెట్టుబడిదారీ విధానం మరింతగా అభివృద్ధి చెందటం, సరళీకృత విధానాలు మధ్యతరగతి వర్గాలలో వ్యత్యాసాలను ప్రగాఢం చేశాయి."

### *మధ్యతరగతి పరిణామం*

పెట్టుబడిదారీ వ్యవస్థయే మధ్యతరగతికి జన్మను యిచ్చింది. స్వాతంత్ర్యానికి పూర్వ దశలో వ్యవసాయేతర ఎగువ కులాల నుంచి మధ్యతరగతి వుద్భవించింది. స్వాతంత్ర్యానంతర కాలంలో వ్యవసాయ సంస్కరణల కారణంగా లబ్దిదారులైన వ్యవసాయ వర్గాలతోపాటే మధ్యతరగతి కూడా విస్తరించి వాటి సరసన చేరింది. 1980ల నాటికి ధనిక, మధ్యతరగతి సెక్షన్లు అభివృద్ధిచెంది వెనుకపడిన కులాల్లోనూ, చివరికి దళితుల్లోనూ (రిజర్వేషన్ల కారణంగా) విస్తరించాయి. 1990లలో నయా వుదారవాద విధానాల రాకతో సేవారంగం త్వరితగతిని విస్తరించి సరికొత్త మధ్యతరగతి సెక్షన్ల ఆవిర్భావానికి దారితీసింది.

### *మధ్యతరగతి-వర్గం*

మధ్యతరగతి-వర్గం సజాతీయమైన వర్గం కాదు. ఇది పలు దొంతరలతో కూడినది. ఇది తనలో, ఎవరైతే శ్రమశక్తిని అమ్ముకుంటారో (సేవారంగం), అలానే యితరుల శ్రమశక్తిని కొనుగోలు చేస్తారో అలాంటివారిని (పెటీబూర్జువాల చిన్న వ్యాపారాలు) యిముడ్చుకున్నది. కార్పొరేట్ సలహాదారులు ఆదాయాన్నీ, వినియోగాన్నీ ప్రాతిపదికగా చేసుకుని సామాజిక విభాగాలను నిర్ధారిస్తారు. పారిశ్రామిక కార్మికుల

నుంచి సంపన్నుల వరకు ఎవరైతే వినియోగ వస్తువులను కొనుగోలు చేస్తారో వారు దీనికిందకు వస్తారు. కనుక, ఆదాయం అనేది ముఖ్యమైన అంశం అయినప్పటికీ, వర్గ నిర్ధారణకు యిది శాస్త్రీయమైన ప్రాతిపదిక కాజాలదు. ఉత్పత్తిలోనూ, అదనపు విలువ వుత్పత్తిలోనూ నిర్వహించే పాత్రను అర్థం చేసుకోవటం ద్వారా యిది జరుగుతుంది. గ్రామీణ, పట్టణ మధ్యతరగతి–వర్గంలో భేదాలు వున్నాయి. పట్టణ ప్రాంతాలలో రకరకాల దొంతరలు వున్నాయి. అంటే, మధ్యతరగతి–వర్గాలలోని భేదాలు ప్రాదేశికమూ, సామాజికమూ, ఆర్థికంగా నిర్వహించే పాత్రలపై ఆధారపడి వుంటాయి. విభిన్న దొంతరలను వేరుచేసే రేఖలు చాలా పలచగానూ అదే సమయంలో బలంగానూ వుంటాయి, అవి వారి వారి వృత్తి, ఆదాయము, సంపద, పెట్టుబడులపై యాజమాన్యాలపై ఆధారపడుతుంది.

### *మధ్యతరగతి–వర్గంలోపల మార్పులు*

*సంప్రదాయక మధ్యతరగతి*

ఇందులో కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వ వుద్యోగులు, ఉపాధ్యాయులు, బ్యాంకుల్లోనూ, బీమా సంస్థల్లోనూ పనిచేసే వుద్యోగులు, డాక్టర్లు, లాయర్లు, ఇంజనీరులు, మేధావి వర్గానికి చెందిన యితరులు వుంటారు. ఈ వర్గానికి చెందిన పలువురు తమ విరామ సమయాన్ని యూనియన్, రాజకీయ, సామాజిక కార్యకలాపాలకు వినియోగిస్తారు. నయా వుదారవాద సంస్కరణల రాకతో డాక్టర్లు, వుపాధ్యాయులు వంటివారు తమ విరామ సమయంలో ఎక్కువ భాగాన్ని తమ వృత్తికి సంబంధించిన, లేదా సంబంధించని వ్యాపారానికి వినియోగిస్తున్నారు. తలిదండ్రులు కూడా తమ బిడ్డల వృత్తికి రూపకల్పన చేయటంలో విశిష్టమైన పాత్రను నిర్వహిస్తూ, భారీగా పెట్టుబడులు కూడా పెడుతున్నారు. కాగా, వారి పిల్లలు తమ విరామ సమయాన్ని ప్రధానంగా అధ్యయనానికి, బోధనకూ, అలానే తమ వృత్తి మెరుగుదలకు వుపయోగపడగలవని భావించిన కార్యకలాపాలకు వుపయోగిస్తున్నారు.

ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేసే కార్మికులు అధిక ఆదాయాన్ని పొందుతున్నారు, వారిలో అత్యధికులు తమనుతాము మధ్యతరగతి – వర్గానికి చెందినట్లు భావించుకుంటారు. వీరిలో అత్యధిక భాగం కార్మిక వర్గ వుద్యమాలకు దూరంగా వుంటూ నయా వుదారవాద విధానాలకు మద్దతుదారులుగా తయారవుతారు. ఈ విధానాల గురించీ, ప్రభుత్వం గురించీ వీరు కార్మికులలో భ్రమలను వ్యాపింప చేస్తుంటారు. తరచుగా వీరు కులీన తరగతికి చెందిన శ్రమజీవులుగా చెప్పుకుంటారు. కార్పొరేట్ రంగం వీరిని మధ్యతరగతి – వర్గీయులుగా గుర్తిస్తుంది (వారి వినియోగ పద్ధతుల ప్రాతిపదికగా).

**మేధావి వర్గం**

ఈ కాలంలోనే మధ్యతరగతి మేధావులపై వామపక్ష భావజాలం యొక్క ప్రభావం బాగా తగ్గింది. రకరకాలైన ప్రభుత్వ, ప్రైవేటు పరిశోధనా సంస్థలు నయా వుదారవాద ఆలోచనలకు, భావజాలానికి మేధో కేంద్రాలుగా రూపొందాయి. విశ్వవిద్యాలయాల్లోనూ, అత్యున్నత విద్యా కేంద్రాలలోనూ సామాజిక, రాజకీయ అంశాలపై చర్చలు బాగా తగ్గిపోయాయి. మేనేజ్‌మెంట్, బిజినెస్ స్కూల్స్ అనేవి నయా వుదారవాద ఆలోచనకు కేంద్రాలుగా మారాయి. మార్కెట్లు, దాని నిర్వాహకులే యీనాడు సామాజిక దృక్పథానికి రూపునిస్తున్నారు, దానిని ప్రభావితం చేస్తున్నారు.

***సరికొత్త మధ్యతరగతి***

ప్రపంచీకరణ ప్రభావ ఫలితంగా ఆవిర్భవించి ప్రాయికంగా సేవారంగంలో నిమగ్నమైన తరగతిని సరికొత్త మధ్యతరగతిగా పిలుస్తున్నారు. ఈ తరగతికి చెందిన విలువలు, ఆకాంక్షలు సమాజమంతటా వ్యాపించాయి, యిది ప్రధానమైన నూతన పరిణామం. ఈ తరగతికి చెందిన వారు ప్రధానంగా ఐటి, బిపిఓ, ఫార్మా, ప్రాథమిక సదుపాయాల రంగం, ప్రైవేటు ద్రవ్యసంస్థలు, ప్రైవేటు విద్య, ఆరోగ్య రంగాలు, ప్రసారమాధ్యమం, పర్యాటకం, కమ్యూనికేషన్స్, రవాణా, ఆతిథ్య–వినోద రంగాలు, వివిధ కార్యక్రమాల ఏర్పాటు, మాల్స్, నర్సింగ్, రియల్ ఎస్టేట్, కన్సల్టెన్సీ, కార్పొరేట్ రంగంలో పనిచేస్తున్నారు. తిరిగి వీటిని మూడు విభాగాలుగా వర్గీకరించవచ్చు :

మొదటిది అత్యధికమైన ఆదాయాన్ని పొందుతూ 'ఆధునిక' జీవనవిధానాన్ని గడిపేవారు (ఎక్కువభాగం ఐటి, ద్రవ్యసంస్థలకు చెందినవారు). ఇక్కడొక విషయాన్ని గమనంలో వుంచుకోవాలి, అదేమంటే ఐటి, ఫార్మా రంగాలలో అదనపు విలువను వుత్పత్తి చేస్తున్నవారు, వారి అవగాహన ఎలావున్నప్పటికీ వారు కార్మికులే అవుతారు. తరచుగా వారిని విజ్ఞాన వృత్తిదారులుగా పిలుస్తున్నారు. ఐటి రంగంలో సైతం 20 నుంచి 25 శాతంమంది డ్రైవర్లు, తోటమాలీలు, పారిశుధ్య శ్రామికులు, గృహనిర్వాహక సిబ్బంది వగైరాలేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. వీరుకూడా 'కార్మిక వర్గం' కిందకే వస్తారు.

సాపేక్షకంగా చూసినట్లయితే, ఎవరి వేతనాలైతే మధ్యస్థంగా వుంటాయో, ఎవరైతే 'ఆధునిక' జీవనాన్ని గడపటానికి పెనుగులాడుతుంటారో, అలాంటివారు రెండవ తరగతి కిందకు వస్తారు. ఈ తరగతికి చెందినవారు ప్రసారమాధ్యమం, మౌలికసదుపాయాల రంగం, కార్పొరేట్ కార్యాలయాలు వగైరాలలో కన్పిస్తారు.

రియల్ ఎస్టేట్, ప్రైవేటు, మైక్రో ఫైనాన్స్‌ల్లోనూ, చిట్‌ఫండ్ కంపెనీలు వగైరాలలో పనిచేస్తూ, 'అదనపు' ఆదాయాన్ని పొందుతున్నవారు మూడవ తరగతిలోకి వస్తారు. స్వభావరీత్యా వీరు పరాన్నభుక్కుగా వుంటారు. వీరిలో కొంతమంది భ్రష్టులుగా

తయారై వుంటారు. వీరిలో అత్యున్నత స్థాయి కార్యనిర్వాహక వర్గంలో5శాతంకన్నా తక్కువమందే వుంటారు, వీరిని సరికొత్త విశ్రాంత వర్గంగా భావించవచ్చును.

***యువజనులు***

మన దేశ జనాభాలో మూడొంతుల మంది 35 ఏళ్ళలోపువారే. మధ్యతరగతికి చెందిన యువజనులు క్రియాశీలురు, శక్తిశాలురు, దృఢసంకల్పులు, సానుకూల వాదులు ఐటి రంగంలో పనిచేసేవారి సగటు వయసు 28 సంవత్సరాలు (2008లో 25 సంవత్సరాలే) వీరు నూతన మధ్యతరగతిలో ప్రథమస్థానంలో వుంటూ యితరంగా వున్న యువజనులను కూడా ప్రభావితం చేస్తుంటారు. యువతులు సైతం వ్యాపారం, రాజకీయాలతోసహా వివిధ రంగాలలో ముందంజ వేస్తున్నారు. వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతున్నది. ఆలుమగలిద్దరూ వుద్యోగస్తులైనపుడు మగవాళ్ళు ఇంటిపనుల్లో సహాయపడటం మొదలుపెట్టారు.

***మధ్యతరగతి పరిమాణం***

మధ్యతరగతి పరిమాణం గురించిన కచ్చితమైన అంచనాలు లేవు. 5 నుంచి 7 శాతం వుంటుందని ఎన్‌సిఏఇఆర్ అంచనా వేయగా, 20 శాతం (25 కోట్లు) వరకు వుండగలదని మెకన్సీ సంస్థ అంచనా వేసింది. కొత్తగా వునికిలోకి వచ్చిన రంగాలలో పనిచేసేవాళ్ళు ఏమేరకు వుంటారన్న విషయమై యింకా పూర్తిగా తెలియలేదు. జనాభాలో 10 శాతం వుండగలరని కొన్ని అధ్యయన బృందాలు అంచనా వేశాయి. పట్టణ జనాభాలో మూడింట ఒకవంతుమంది మధ్యతరగతి వుంటారని, అయితే, ఐరోపా, అమెరికాలలోవలె కాకుండా యిక్కడ పెరుగుతున్నదని చెప్తున్నారు.

***సేవారంగం***

జిడిపీని దృష్టిలో వుంచుకున్నపుడు వ్యవసాయం తరువాత 65 శాతంతో సేవారంగమే అతిపెద్దదిగా వున్నది. అయితే, మొత్తం వుద్యోగాలలో అది 28 శాతాన్ని మాత్రమే కల్పిస్తున్నది. అసంఘటిత రంగంలోని రిటైల్, టోకు వ్యాపారాలు 80 శాతం వుద్యోగాలను కల్పిస్తున్నాయి. రియల్ ఎస్టేట్, ద్రవ్యరంగం, బీమా, బిజినెస్ సర్వీసులు 20 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. సేవారంగంలో శ్రమ వుత్పాదకత చాలా ఎక్కువగా వున్నది. 1993-94 నుంచి 2009-10 మధ్య ప్రభుత్వరంగ వుద్యోగాలు 11 శాతం తగ్గిపోయాయి.

***ఉపాధి***

అసంఘటిత రంగంలో వుపాధి అవకాశాలు పెరిగాయి. ఇంజనీరింగ్ విభాగాన్ని కలుపుకుని యిక్కడ 94 శాతం వుద్యోగిత వున్నది. ఉద్యోగ అభద్రత, విపరీతమైన ఒత్తిడి వున్నప్పటికీ ఆదాయ అవకాశాలు మెరుగుపడగలవన్న ఆశతో వుద్యోగులు యీ వుద్యోగాలలోనే కొనసాగుతున్నారు. రియల్ ఎస్టేట్, ద్రవ్యరంగం,

పర్యాటకం, ప్రసారమాధ్యమం, విద్య, ఆరోగ్య సంరక్షణ, కన్సల్టెన్సీ, రిటైల్ బిజినెస్, మాల్స్, కార్యక్రమాల నిర్వహణ, కమ్యూనికేషన్స్, రవాణా, ప్రైవేటు కార్యాలయాలు, నిర్మాణ రంగం, మౌలిక సదుపాయాల రంగం, గృహనిర్మాణం వగైరాలలో వుద్యోగ అవకాశాలు ఎక్కువగా వున్నాయి. 1993-94 నుంచి 2011-12 మధ్య వీటిల్లో రెండు కోట్లమంది వుద్యోగాలలో చేరారు. కాగా, వస్తుతయారీ రంగంలో కేవలం 60 లక్షల వుద్యోగాలు మాత్రమే కలిశాయి.

ఈ రంగాలలోని వుద్యోగావకాశాలు స్వభావరీత్యా సంప్రదాయేతరమైనవి. సట్టా వ్యాపారాలు, షేర్లు, రియల్ ఎస్టేట్, విద్య, ఆరోగ్య సంరక్షణ రంగాలలో దళారీతనంతో ముడిపడిన వుద్యోగాలు త్వరితగతిని పెరుగుతున్నాయి. అలానే, వున్నతాధికార వర్గానికీ, ప్రభుత్వానికీ కావలసిన రకరకాల సేవలతో సంబంధం కలిగినవి కూడా యీ జాబితాలోకే వస్తాయి. ఇంతకుముందు పరిమితంగానే వున్న దళారీతనం యిప్పుడు కిందిస్థాయికి వచ్చింది. ఒకరకంగా యిది పట్టణ మధ్యతరగతిలోని మధ్య, దిగువ స్థాయిల్లో వారికి స్వయం వుపాధిని కలిగించింది. ముఖ్యంగా లైసెన్సులు, పర్మిట్లు జారీ, రవాణా విభాగాలు, మున్సిపాలిటీ, పంచాయతీ తదితర కార్యాలయాలలో అనుమతి పత్రాలు సంపాదించి పెట్టటం వంటివన్నీ యీ కోవలోకే వస్తాయి. వినియోగపద్ధతుల్లో మార్పులు రావటంతో సూపర్ మార్కెట్‌లలోనూ, అలానే సిమ్‌కార్డుల అమ్మకం, ద్రవ్య పథకాల ప్రచారం వంటి వాటిల్లో చిన్నచిన్న వుద్యోగాలకు మంచి గిరాకీ వచ్చింది. ప్రైవేటు పరిశ్రమ గణనీయంగా పెరిగింది, చిన్న, పెద్ద పరిశ్రమలు కూడా పెరిగాయి.

**ఐటి**

ఐటి, బిపిఎం పరిశ్రమలో 31లక్షల మంది పనిచేస్తుండగా అందులో 10 లక్షల మంది స్త్రీలు వున్నారు. గత దశాబ్దంలో నియామకమైన వారు 20 లక్షలమంది. జిడిపీలో దీని వాటా 8.1 శాతం కాగా, ప్రపంచ ఐటి మార్కెట్‌లో 7 శాతం వాటాను కలిగివున్నది. 2014 ఆర్థిక సంవత్సరంలో దీని మొత్తం ఆదాయం 11800 కోట్ల అమెరికన్ డాలర్లు. నిర్మాణ రంగం తరువాత సేవారంగమే అతిపెద్దది. సేవారంగంలో పనిచేసేవారిలో 90 శాతం మంది 8 నగరాలలో కేంద్రీకృతమై వున్నారు.

ఐటి పెరుగుదల ఎగుమతి ఆధారితం. దాని ఆదాయంలో సేవల వాటా 64 శాతంకాగా, బిపిఎం 23శాతం, సాఫ్ట్‌వేర్ వుత్పత్తులు18 శాతంగా వున్నాయి. హార్డ్‌వేర్ వాటా చాలా తక్కువ, అంటే 13 శాతంగా వున్నది. గత రెండు సంవత్సరాల కాలంలో దేశీయ మార్కెట్ స్తంభించింది, 3200 డాలర్లను మాత్రమే సంపాదించింది. ఈ పరిశ్రమలో 15,000 సంస్థలు వున్నాయి. మొత్తం వుద్యోగులలోనూ, ఆదాయంలోనూ 40 శాతానికి 11 కంపెనీలు ప్రాతినిధ్యం వహిస్తుండగా120 నుంచి

150 వరకు వున్న మధ్యతరహా కంపెనీలు 35 నుంచి 40 శాతానికి ప్రాతినిథ్యం వహిస్తున్నాయి. 15,000గా వున్న కంపెనీలలో ఎక్కువ భాగం చాలా చిన్నవి, 9 నుంచి 10 శాతం వుద్యోగులకు, ఆదాయానికీ యివి ప్రాతినిధ్యాన్ని వహిస్తున్నాయి. 1200 నుంచి 1500 వరకు కొత్తగా పుట్టుకు వచ్చినవి. ఐటి పరిశ్రమలో ప్రధానంగా ఇంజనీరులు, యితర పట్టభద్రులు (77 శాతం) వున్నారు. తరువాత ఎంబిఏ, ఎంసిఏ, ఎంఎస్‌సి చదివినవారు (14 శాతం) వున్నారు. ఇతరులు 10 శాతంగా వుంటారు.

వస్తుతయారీ రంగంలోనూ, వ్యాపార రంగంలోనూ ఆటోమేషన్ (స్వయంచలిత యంత్రాల) ప్రవేశించిన ఫలితంగా ఐటి, బిపిఎం పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. ఏదైతే ఆటోమేషన్‌కు ఆధారమో యిప్పుడదే బలిపశువుగా మారింది. అత్యున్నత నైపుణ్యం కలిగిన అతికొద్దిమంది డెవలపర్స్ ఐటి క్రమానికి అవసరమవుతారు. ఈ అత్యున్నత నైపుణ్యం కలిగిన వుద్యోగాలు అభివృద్ధి చెందిన దేశాలకు తరలుతున్నాయి. ఇవే మేధోసంపద హక్కులను గుప్పెట్లో పెట్టుకున్నాయి. ఈ రంగంలోని వుద్యోగ మార్కెట్ రెండు తరహాల పనిగా కుదించుకుపోయింది. అత్యున్నత నైపుణ్యం కలిగిన వారు అభివృద్ధి చెందిన దేశాలకు వెళ్తుండగా, తక్కువ నైపుణ్యం కలిగినవారు చౌకమార్కెట్లు వుండే వియత్నాం, ఫిలిప్పైన్స్ వంటి దేశాలకు వెళ్తున్నారు.

ప్రైవేటు వృత్తి కళాశాలలు విస్తరించటంతో ప్రతియేటా లక్షలమంది పట్టభద్రులు తయారవుతున్నారు. అయితే ఐటి రంగంలో ఏడాదికి 70 వేల నియామకాల నుంచి 30 వేలకు తగ్గిపోయింది. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే వుద్యోగార్థులైన ఇంజనీరింగ్ పట్టభద్రులు 5 లక్షలమంది వున్నారు. ఇళ్ళకు వెళ్ళాలనే ఆశలేని వారు అందుబాటులో వున్న కొద్దిపాటి వుద్యోగాలతో సంతృప్తి పడుతున్నారు. ప్రస్తుతం తక్కువ వేతనాలకే కార్పొరేట్ రంగం నియామకాలు చేస్తున్నది. ఇలాంటి వారు వుద్యోగ అభద్రతను ఎదుర్కొంటున్నారు, తగ్గింపులకు లేదా ఇంక్రిమెంట్లు లేకుండా వుంటున్నారు. నియామకాలు బాగా తగ్గిపోయాయి, తొలగింపులు సాధారణమయ్యాయి. 2014 జనవరిలో నాటి ఆర్థిక మంత్రిత్వ శాఖ రూపొందించిన పత్రంలో యీ సమస్యల ప్రస్తావన వున్నది.

**పని పరిస్థితులు**

దోపిడీని వుధృతం చేసేందుకై పాలక వర్గాలు ఆధునిక పద్ధతులను అమలులోకి తెచ్చాయి. సాపేక్షకంగా చూసినట్లయితే, అధిక వేతనాలు, అధిక దోపిడీతో జతకలసి వుండటం సర్వసాధారణం. ప్రతిఒక్కరి పనితీరును నమోదు చేస్తారు. గడువులు, అంచనాలకు సంబంధించిన ప్రతిఒక్క వివరాన్ని లెక్కకడుతుంది. వేతనం రెండు భాగాలుగా వుంటుంది: మొదటి దానిని ఏకీకృత వేతనం అంటారు, రెండవది

పనితీరు ప్రాతిపదికను వేసిన అంచనాతో కూడినదై వుంటుంది. సాధారణంగా యీ రెండవది మొత్తం వేతనంలో 50 శాతంగా వుంటుంది. ఉద్యోగుల బృందం పనితీరు సూచికను పొందుతుంది. దీని ఆధారంగానే ప్రతి ఒక్కరికీ చెల్లింపులు వుంటాయి. దీనర్థం ఏమిటంటే, ఎక్కువ మొత్తాన్ని పొందేవారే అన్ని సమయాలలోనూ వుత్తమమైన పనితీరును ప్రదర్శించారని అనుకోనవసరం లేదు.

ఆరోగ్య బీమా, ప్రావిడెంట్ ఫండ్ చెల్లింపులు వేతనంలోని మొదటి భాగంపై ఆధారపడి వుంటాయి.

గడువులు విధింపు, వేర్వేరు ప్రదేశాల నుంచి పనిచేసే అవకాశంవల్ల ఇంటివద్దనుండైనా పనిచేసేలా ఒత్తిడి వస్తుంది. ఇది పనిగంటల పెరుగుదలకు దోహదపడుతుంది. రోజుకు 8 గంటలు చేయవలసివుండగా, వాస్తవంలో కనీసం 11 నుంచి 12 గంటలు పనిచేస్తారు. ఎక్కువ భాగం దోపిడీ, వారు వుత్పత్తి చేసే అదనపు విలువతో కూడివుంటుంది, యాజమాన్యం అనుసరించే అధునాతన పద్ధతులు అదనపు విలువ మొత్తాన్ని పెంచేవిగా వుంటాయి. ఈ రంగంలో దోపిడీ అధికంగా వున్నప్పటికీ, సంక్షోభ సమయాల్లో మినహా సంప్రదాయ పద్ధతుల్లో వీరిని సంఘటితం చేయటం చాలాచాలా కష్టం.

### *ట్రేడ్‌యూనియన్ స్థాపన*

పనియొక్క సంప్రదాయేతర స్వభావమూ, వుద్యోగాలలో వైవిధ్యమూ, వుపాధి, పనితీరు సేవారంగంలో చాలా ఎక్కువగా వుంటుంది. ఎక్కువ వేతనాల కోసమూ, వృత్తినైపుణ్యాన్ని పెంచుకోవటానికీ వృత్తినీ లేదా యజమానినీ వుద్యోగులైనవారు నిరంతరం మారుస్తూ వుంటారు. శాశ్వత వుద్యోగాల స్థానంలో తాత్కాలిక వుద్యోగాలు వచ్చిపడ్డాయి. వేతన పెంపుదల కోసం పోరాటం చేసే స్థానంలో వుద్యోగాన్ని మార్చటం వచ్చింది. కనుక, సంఘటితం కావటం అన్నది కాలం చెల్లిన కార్యంగా భావించటం జరుగుతున్నది. సమిష్టిగా బేరసారాలాడటం, కార్మిక సంఘాన్ని కలిగి వుండటం అన్న ఆలోచనలు పనికిరావని భావిస్తున్నారు. ఈ పని స్వభావం ఎలాంటిదంటే యిది స్థల, కాలాల పరిధులను బద్దలు కొట్టింది. వేర్వేరు ప్రదేశాలకు చెందిన వారితో బృందాలను పని స్థలంలోనూ, దేశంలోపలా, దేశం వెలుపలా ఏర్పాటు చేస్తారు. కంపెనీలోకి వుద్యోగుల ప్రవేశం వారు పనిచేసే అంతస్తుకు లేదా గదికి మాత్రమే పరిమితం. వేర్వేరు ప్రాంతాలలో వున్నవారు నిర్దిష్టమైన పనిని పూర్తిచేస్తారు. దీనర్థమేమిటంటే వుద్యోగులు మొత్తం ఒకే ప్రదేశంలో సమష్టి వుత్పత్తిలో పాల్గొనరు. నిర్దిష్టమైన ప్రాజెక్టుల పరిపూర్తికి గడువును పకడ్బంధీగా రూపొందిస్తారు. దీనివల్ల వుద్యోగి చాలా కష్టపడవలసి వస్తుంది. తుది వుత్పత్తి కళ్ళకు కనిపించేది కాదు. దాని వుత్పత్తి సమయాన్ని కూడా వూహించలేము, కాని పనిమాత్రం నిర్దేశిత సమయంలో

పూర్తవుతుంది. ఇది కొత్తగా స్థాపించిన లాభదాయకమైన పరిశ్రమ అయినట్లయితే వ్యక్తిగతంగా బేరసారాలాడగల శక్తి ఎక్కువగా వుంటుంది, దీనితో పైన పేర్కొన్న సమస్యలపై ఎక్కువగా దృష్టి పెట్టరు. కార్మిక చట్టాలను అమలు చేయడంలో అనుసరించ వలసిన మార్గదర్శకాలను విస్మరించిన ఫలితమిది. యూనియన్ స్థాపనకు నివాస ప్రాంతాలలో సభలు, అలానే సహచర బృందాలను వుపయోగించుకోవటం గురించి ఆలోచించవలసి వుంది.

**నైపుణ్యాభివృద్ధి**

గ్రామాలలోని అట్టడుగు తరగతికి చెందిన విద్యాధిక యువతరం దారుణంగా దెబ్బతిన్నది. నియామకాలకు అవసరమైన మౌలిక నైపుణ్యాలు పెరిగాయి. యథార్థమైన యీ సమస్యను అడ్డుపెట్టుకుని శిక్షణ యిస్తామంటూ కోచింగ్ సెంటర్లు, మోసపూరిత కంపెనీలు యువతీ యువకులను దోచుకుంటున్నాయి. నైపుణ్యాభివృద్ధి కోసం రకరకాలుగా పెద్దయెత్తున డబ్బును చెల్లించవలసి రావటంతో గ్రామీణ కుటుంబాలపై పెనుభారం పడుతున్నది. ఉన్నత విద్యను పూర్తి చేసుకున్న అట్టడుగు తరగతులకు చెందిన యువతీ యువకులు సంఖ్యరీత్యా పెరిగారు, పోటీకూడా పెరిగింది, వుద్యోగ అవకాశాలు క్షీణించాయి. ఈ విద్యార్థులు జయప్రదంగా పోటీపడలేకపోతున్నారు. ప్రభుత్వ వుద్యోగాలలో సైతం పోటీ పెరిగింది. కాగా, ప్రైవేటు రంగం మాత్రం అవినీతిని, గరిష్ట లాభాలను, దుర్మార్గమైన దోపిడీ రూపాలను, స్వాధీనాలను పెంచిపోషిస్తున్నది. ఆర్థిక వ్యవస్థలోని అనూహ్యమైన మార్పులు యువతరంపై ప్రభావాలను చూపాయి, అనేకమంది ప్రైవేటు రంగంపై వున్న భ్రమలను తొలగించుకున్నారు. 2005లో కేంద్ర ప్రభుత్వం 'జాతీయ నైపుణ్య అభివృద్ధి కార్పొరేషన్'ను స్థాపించింది, కాని దీనిపాత్ర నామమాత్రమైనది. అనేక ఇంజనీరింగ్ కళాశాలలు బూటకమైనవే; అవినీతిమయమైన ఏఐసిటిఇ అసమర్థంగా తయారైంది.

***విద్య***

విద్య ఎంత ఖరీదుగా తయారైందంటే, పిల్లల చదువు కోసం పొదుపు చేయటం వారు పుట్టకముందు నుంచే ప్రారంభమౌతోంది. తమ పిల్లల మేధోశక్తి అభివృద్ధి గురించిన తల్లిదండ్రుల ఆకాంక్షలు చాలా ముందుగానే మొదలవుతున్నాయి. శిశువిద్యాలయాల మార్కెట్ దాదాపు రూ. 4,000 కోట్లవరకు వున్నట్లు ఒక అంచనా. వీటి ఫీజులను క్రమబద్ధం చేసేందుకై ఢిల్లీలో న్యాయస్థానాలు జోక్యం చేసుకున్నాయి. వీటిల్లో చేరికకు సంబంధించి కొంతమంది వ్యక్తులు, బృందాలు ప్రజాప్రయోజనాల వ్యాజ్యాలను వేశారు. తల్లిదండ్రుల అసోసియేషన్‌లు ఏర్పాటయ్యాయి. కానీ, యివిగానీ, ఉపాధ్యాయ సంఘాలుగానీ నిరంతరం పెరుగుతున్న ఫీజుల విషయంలో జోక్యం చేసుకోలేకపోయాయి. బడికి వచ్చిపోయే కాలం, ఫీజులు, భద్రత, లైంగిక వేధింపులు,

శారీరక దండన వంటివన్నీ తీవ్రమైన ఆందోళనకు కారణమవుతున్నాయి. ఉన్నత విద్య కోసం అత్యున్నత విద్యాసంస్థలలో ప్రవేశం కోసం తల్లిదండ్రులు తమ పిల్లలకు 7 లేదా 8వ తరగతి నుంచే కోచింగ్‌లు యిప్పిస్తున్నారు. ఉన్నత విద్యకోసం చేసే సన్నాహాల కోసం, ఉన్నత విద్యకోసం అంతకంతకు వ్యయం పెరుగుతున్నది. పిల్లల భవితవ్యానికి భద్రత కరువు కావటంతో తలిదండ్రులు తమ పిల్లలను అదుపు చేసేందుకై విరామసమయాన్ని లేకుండా చేస్తున్నారు. ఇప్పటికే 6 నుంచి 14 ఏళ్ళ మధ్య వయసున్న పిల్లల్లో ప్రైవేటు పాఠశాలల్లో చేరేవారు 30 శాతం వరకు వున్నారు (దక్షిణ భారతంలో యింకా ఎక్కువ).

***పని స్థలాల్లోనేకాదు నివాస ప్రాంతాల్లో కూడా దోపిడీ వుంది***

సాపేక్షకంగా చూస్తే అధిక వేతనాలను అందుకుంటున్న యీ తరగతుల (సరికొత్త మధ్యతరగతి) ప్రజలు దోపిడీకి గురవుతున్నారు. వారు తమ నివాస ప్రాంతాల్లో కూడా దోపిడీకి గురవుతున్నారు. ధరల పెరుగుదల వారి నిజ వేతనాలను కుదించి వేస్తున్నది. అంతేకాక, అత్యధికంగా వున్న భూమి ధరలు, రుణాలపై నెలసరి వాయిదాలు, వడ్డీరేట్లు, ఆదాయ పన్ను, వినియోగ ఛార్జీలు, ప్రైవేటు విద్య, ఖరీదైన ఆరోగ్య సదుపాయాలు, పెట్రోలు ధరల పెరుగుదల వగైరాలన్నిటికీ వారు గురవుతున్నారు.

***సరికొత్త మధ్య తరగతి లక్షణాలు***

వీరు వుద్రేకంతో వూగిపోతుంటారు. ఆధిపత్య భావజాలానికి తేలికగా ప్రభావితమై త్వరితగతిని వాటిని వల్లెవేస్తుంటారు. వారు అభిప్రాయాల సృష్టికర్తలు. వేతనాలు, లాభాలు, కమిషన్లు, బ్రోకరేజీలు, రుణాలు, ప్రభుత్వ పథకాలు తదితరాల కారణంగా వీరు లబ్ధి పొందుతుంటారు. ఎవరి ఆదాయాలైతే పెరుగుతాయో వారు సంస్కరణలు కొనసాగాలని కోరుకుంటారు.

1. నూతన మధ్యతరగతికి చెందిన వారికి ఆదాయాలు అధికంగా వుంటాయి. వారు ఆధునిక సదుపాయాలను వుపయోగించుకుంటూ బ్రహ్మాండమైన వినియోగదారుల బృందంగా తయారవుతారు. అప్పుచేసి కొనుగోళ్ళు చేస్తారు, చివరకు అప్పులలో మునుగుతారు. పాక్షికంగా వారు 'చిహ్నాలుగా' మారి హోదాలను పొందుతారు, దీనివల్ల వారు ఖర్చులను లెక్కచేయరు.
2. వారికి ఆశలు ఎక్కువ, తేలికగా జయం సాధించాలనుకుంటారు, తమకన్నా తక్కువ స్థితిలో వున్నవారిని తేలికగా చూస్తారు. వారికి అప్పటికప్పుడే ఫలితాలు కావాలి, సంపద కావాలి. వీటికోసం వలస పోవటానికి సిద్ధపడతారు.
3. వీరు ఇంగ్లీషు మాట్లాడుతారు, లేదా తమ మాతృభాషతో ఆంగ్లాన్ని కలిపి మాట్లాడతారు. విదేశీ వుద్యోగాల కోసం పరాయి దేశాల్లో చదువుతారు. వారికి

యితరులతో సంబంధాలు, వ్యాపార లావాదేవీలు, వృత్తి నైపుణ్యాలను కలిగి వుంటారు.

4. ఇంతకుముందు వుద్యోగ మార్పిడి అనేది చిక్కుల్తో కూడుకుని వుండేది. కాని, యిప్పుడు, అధిక వేతనాల–సౌకర్యాలు–స్థాయి కోసం అన్వేషించడం సాధారణమై పోయింది. ఇటీవలి ఆర్థిక తిరోగమనం తరువాత పని ఒత్తిడి తగ్గినప్పటికీ, అత్యున్నత నైపుణ్యం వున్నవారు మంచి కొలువుల కోసం వెదుకుతూనే ఖాళీగా వుండటానికి సిద్ధపడుతున్నారు.
5. వీరు మొత్తంగా వుదారవాదానికి మద్దతుదారులే అయినప్పటికీ, దేశ సంపదను ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం కబళిస్తున్నదన్న విశ్వాసంపై ఆధారపడిన యిటీవలి అవినీతి వ్యతిరేక పోరాటాలలో వీరిలో చాలామంది పాల్గొన్నారు.
6. వీరికి వామపక్షాలతోసహా రాజకీయాలన్నా, రాజకీయవాదులన్నా విముఖత వుంటుంది. 2014 ఎన్నికల సమయంలో, మోడీని 'సత్పరిపాలనకు, నూతన రాజకీయాలకు, అభివృద్ధికీ' ప్రతినిధిగా భావించిన వీరిలో రాజకీయాలపట్ల వైముఖ్యం తగ్గుముఖం పట్టింది. ఢిల్లీలో వారు ఆమ్‌ఆద్మీ పార్టీకి మద్దతు యిచ్చారు. దీని ప్రభావం కొంతమేరకు తగ్గినప్పటికీ, ఏ సామాజిక వర్గం నుంచైతే యిది మద్దతును పొందిందో అది బలాన్ని పుంజుకున్నది.

### *నయా వుదారవాద విధానాల యొక్క సాంస్కృతిక ప్రభావం*

సంపద పెరిగే కొలదీ పేదలు క్రమక్రమంగా లబ్ది పొందుతారన్న సిద్ధాంతం తప్పని పెరుగుతున్న అసమానతలు రుజువు చేస్తున్నాయి. అయితే, రుణాలు, వేతనాలు, రియల్ ఎస్టేట్‌లో సట్టావ్యాపార పెట్టుబడులు వగైరాలు పెరగటంతో చెలామణిలోకి మరింత డబ్బు వచ్చిచేరిన మాట వాస్తవం. ఇది మధ్యతరగతిని, జీవన విధానాన్నీ ప్రభావితం చేసింది. నయా వుదారవాద విధానాలు నూతన సంస్కృతిని తీసుకువచ్చాయి, యిది మధ్యతరగతి యొక్క సామాజిక చైతన్యాన్ని ప్రభావితం చేసింది. మానవ సంబంధాలు మారిపోయి డబ్బు ప్రాధాన్యత వారిని కలపసాగింది. వస్త్రధారణ, మాట్లాడేతీరు, అవయవ విన్యాసం, ఆహార వినియోగం వంటివన్నీ మారిపోయాయి. మెక్డోనాల్డ్స్, కెఎఫ్‌సి, డొమినోయిస్, కేఫ్ కాఫీ డే వంటివి వ్యాప్తిలోకి రావటమే యిందుకు రుజువు. మార్కెట్‌లోకి వచ్చిన నూతన వుత్పత్తిని సొంతం చేసుకోవాలనే మోజు పెరుగుతున్నది. ఇదొక నయా నాగరికతగానూ, సాంఘిక హోదాగాను మారిపోయింది. స్మార్ట్ ఫోన్ కనీసావసరంగా మారింది. ఈ ధోరణిని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. చివరికి జన్ ధన్ యోజన ఖాతాలకు సైతం రూ. 5000ల ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యాన్ని కల్పించారు. ఈ–కామర్స్ త్వరితగతిని పెరుగుతున్నది. ప్రస్తుతం మార్కెట్‌లో దానివాటా 1400 కోట్ల డాలర్లుగా వున్నది, ముమ్ముందు యిది మరింత వేగంగా

పెరుగనున్నది. సరఫరాను యిది పునర్వ్యవస్థీకరించేలా చేస్తుంది. కాగా, ఈ–కామర్స్ కొత్త రంగాల్లోకి చొచ్చుకు వెళ్తున్నది. ప్రయాణాలు, ఎలక్ట్రానిక్స్, దుస్తులు, పుస్తకాలు తదితర వినియోగ వస్తువుల అమ్మకాల్లోకి చొరబడింది.

**సామాజిక బృందాలు**

దళితులు, వెనుకబడిన తరగతులకు చెందినవారు నిర్మాణ రంగంలో పనిచేసేందుకై పెద్దయెత్తున పట్టణాలకు తరలుతున్నారు. నయా వుదారవాద సంస్కరణల శకం ప్రారంభమైన నాటినుండి నిర్మాణ రంగం మంచి వూపులో వున్నది. వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం పెరుగుదల, హరిత విప్లవంతో వూపందుకోవటం వలన ఓబిసీలలో మధ్య తరగతి వునికిలోకి వచ్చింది. దళితుల్లోనూ, ఎస్టీల్లోనూ రిజర్వేషన్లు యిలాంటి పరిస్థితినే తీసుకువచ్చాయి. ప్రస్తుతం ఓబిసీలు మధ్యతరగతిలో గణనీయమైన భాగంగా వుండగా, దళితుల ప్రాతినిథ్యం కొద్దిపాటిగానే వున్నది. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు లేకపోవటంతో దళితులు, ఎస్టీలకు చెందినవారు యిక్కడ కనిపించరు. "ప్రైవేటురంగ వుద్యోగాల నియామకంలో వివక్షత వున్నట్లు" ఇండియా లేబర్ మార్కెట్ నివేదిక–2008 అంగీకరించింది.

పట్టణ ప్రజలలో దళితులు 12.5 శాతంగా వున్నారు. కాగా, మొత్తం దళితుల్లో 20 శాతంమంది పట్టణాలలో నివసిస్తున్నారు, వీరిలో ఎక్కువమంది మురికివాడల్లో జీవిస్తున్నారు. మధ్యతరగతిలోకి ప్రవేశించినవారు తమ స్థానాన్ని ఎగువకు తీసుకు వెళ్ళగలిగారు. ఈ కాలంలో చాలామంది వ్యాపారులుగానూ, కాంట్రాక్టర్లుగానూ మారారు. సిఐఐకి అనుబంధంగా డిఐసిసిఐను ఏర్పాటు చేయటమే యీ ధోరణికి వుదాహరణ. ఎన్నికలు వచ్చినపుడు సార్వత్రిక స్థానాలలో స్వతంత్ర అభ్యర్థులుగా దళితులు, ఎస్టీలు పోటీ చేస్తున్నారు. ఈ స్థానాలలో రాజకీయ పార్టీలు నిలిపే అభ్యర్థులలో వీరు 1 శాతంగా వున్నారు. ప్రస్తుతం వినిపిస్తున్న 'సమీకృత రాజకీయాలు', 'నిశ్చయాత్మకమైన కార్యాచరణ' అన్న నినాదాలు ఎస్‌సీలలో చోటుచేసుకుంటున్న వర్గీకరణను సూచిస్తున్నాయి.

వివిధ గిరిజన తెగలకు చెందిన 2.4 శాతం మంది మాత్రమే పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్నారు. నయా వుదారవాద విధానాల ప్రభావమూ, అలానే వలసలు పోవటం వీరి విషయంలో చాలా తక్కువ.

ఓబిసీలలోనూ, ముస్లింలలోనూ ఎక్కువమంది స్వయం వుపాధిపరులు. ఓబిసీలలో కొన్ని కులాలు గణనీయంగా అభివృద్ధి చెందగా ఎంబిసీలు యిప్పటికీ వెనుకబడే వున్నారు.

జనాభా లెక్కలు సూచించేదానికన్నా క్రైస్తవులు అధికంగా, అంటే 2.4 శాతంగా వుంటారు. రిజర్వేషన్ ద్వారా వచ్చిన వుద్యోగాలు పోతాయేమోనన్న భయంతో

వారు తరచుగా తమ గుర్తింపును మరుగుపరుస్తుంటారు. పలువురు పేదలు, మధ్యతరగతికి చెందిన వారు, ప్రత్యేకించి స్త్రీలు ఓదార్పు కోసం క్రైస్తవాన్ని స్వీకరిస్తున్నారు. నిరుద్యోగులు పాస్టర్లుగా మారుతున్నారు. దీనిని బిజెపీ అవకాశంగా తీసుకుని తిరిగి మతం మార్చుకునేలా వారిని ఒత్తిడి చేస్తున్నది. ఈ ధోరణి ఆయా బృందాల మధ్య వుద్రిక్తలకు దారితీస్తున్నది.

ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేస్తున్న అణగారిన తరగతులకు చెందినవారు ప్రత్యేకంగా కుల సంఘాలుగా, సమాఖ్యలుగా సంఘటితమవుతున్నారు. కాగా యిదే సమయంలో వీరిలో అనేకులు కార్మిక సంఘాల సభ్యులుగానే కొనసాగుతున్నారు. వర్గంకన్నా కులం గుర్తింపునే వారు స్వీకరిస్తున్నారు. ఈ అంశాలను గమనంలోకి తీసుకోకుండా యీ తరగతులను సమైక్య కార్మిక సంఘ వుద్యమంలోకి తీసుకురావడం కష్టం.

***పట్టణ ప్రాంతాలలో కులవివక్ష***

గ్రామీణ ప్రాంతాలలో వున్న పద్ధతిలో పట్టణ ప్రాంతాలలో అస్పృశ్యత కన్పించనప్పటికీ వేర్వేరు మార్గాలలో కులవివక్ష కొనసాగుతూనే వున్నది. అద్దె ఇళ్ళను పొందటంలోనూ, అలానే దళితులపట్లా, యితర నిమ్నకులాలపట్లా ఎగువ కులాలకు చెందిన వుద్యోగుల వైఖరిలోనూ దీనిని మనం గమనించవచ్చు. ఒకే అపార్టుమెంటులో నివసిస్తున్నప్పటికీ సామాజిక కార్యక్రమాలకు వారు ఆహ్వానితులు కావటంలేదు. జైపూర్‌లాంటి పట్టణాలలో కుల ప్రాతిపదికన శ్మశానవాటికలను పురపాలక సంఘాలే నిర్వహిస్తున్నాయి. తిరుచిరాపల్లిలో దళితుల ఇళ్ళకు, యితరుల ఇళ్ళకు మధ్య గోడలు వుంటాయి. కులాంతర వివాహాలు కేవలం 11 శాతంగా మాత్రమే (తమిళనాడులో యింకా తక్కువ) వున్నాయి.

పట్టణ ప్రాంతాలలో కుల, మతాల ప్రభావం ఎక్కువగానూ, మార్పులేకుండానూ ఎందుకున్నదీ మనం అధ్యయనం చేయవలసి వుంది.

***పెరిగిన మహిళల చొరవ***

ప్రజా జీవితంలో మహిళలు పాల్గొనటం గణనీయంగా పెరిగింది. ఈ కాలంలో నూతనంగా వునికిలోకి వచ్చిన రంగాలలో (ఐటి, ఐటి–ఇఎస్, ఫార్మా, బయో–టెక్, ద్రవ్యరంగం, బాంకింగ్, ప్రసారమాధ్యమం, రిటైల్ మార్కెట్లు, పర్యాటకం, ఫ్యాషన్ టెక్నాలజి, హోటల్ మేనేజ్‌మెంట్ తదితరాలు) మహిళలు ఎక్కువ సంఖ్యలో వున్నారు. ఇదే సమయంలో బోధన, నర్సింగ్ రంగాలలో వారి సంఖ్య గణనీయంగా వున్నది, యింకా పెరుగుతున్నది. ఈ పరిస్థితులలో పనిస్థలంలోనూ, బహిరంగ ప్రదేశాలలోనూ మహిళల భద్రత అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నది.

ప్రజాజీవితంలో స్వేచ్ఛను, ఎంపికను, సమానతను యువతులు డిమాండు చేయటం అంతకంతకూ పెరిగింది. స్త్రీలపై జరుగుతున్న నేరాలకు వ్యతిరేకంగా నిరసనలు పెరుగుతున్నాయి. కాగా, దివాంధాలు యీ నేరాల పెరుగుదలకు బాధ్యతను మహిళలపైనే నెట్టివేస్తున్నాయి. లైంగిక వివక్షతలకు వ్యతిరేకంగానూ, సమానత్వం కోసమూ జరిగే పోరాటాలకు మద్దతు పెరుగుతున్నది. విద్యాధిక, మధ్యతరగతి స్త్రీలలో చైతన్యం గణనీయంగా పెరుగుతున్నది.

***కుటుంబ సంబంధిత అంశాలు***

రకరకాలైన సామాజిక వుద్రిక్తతలు కుటుంబ పరిధిలో ప్రతిబింబిస్తున్నాయి. కుటుంబ పరిధిలో స్త్రీలకు సమానత వున్నది, కుటుంబ వ్యవహారాలలో వారికి ప్రాధాన్యత లభిస్తున్నది. 30 శాతం మధ్యతరగతి కుటుంబాలలో ఆర్థిక అవసరాలకు మహిళలు తోడ్పాటును అందిస్తున్నారు. అయితే, కొత్త సమస్యలు తలయెత్తుతున్నాయి. అది పిల్లల పెంపకం కావచ్చు, లేదా వృద్ధులపట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు కావచ్చు, యివికూడా కాకుంటే రుణాలు లేదా పెట్టుబడుల విషయం కావచ్చు. ఇదేవిధంగా పనిగంటల పొడిగింపు, సంప్రదాయేతర స్వభావమూ, వేతన అస్థిరత, రాకపోకలకు అనుకూలంగాలేని పరిస్థితులు, పని సమయమంతా కూర్చోవలసి రావటం, జీవన విధానమూ వంటివన్నీ కుటుంబ సభ్యులతోనూ, మిత్రులతోనూ గడిపే సమయం లేకుండా చేస్తున్నది.

***సాంస్కృతిక-ఆధ్యాత్మిక అంశాలు***

ఈనాడు ప్రతిఒక్కటీ దానిదైన ధరను కలిగివుండేలా ప్రభుత్వ విధానాలు తయారయ్యాయి. వినోదము, వుల్లాసము, ఆటస్థలాలు, పార్కులు, ఈతకొలనులు వంటివాటికి డబ్బులు చెల్లించవలసి రావటంతో సాంస్కృతిక, ఆధ్యాత్మిక అంశాలు కుదించుకుపోతున్నాయి. జనులకు సేదతీరే సౌకర్యాలను కల్పించటం తన బాధ్యతగా భావించని ప్రభుత్వం దీనిని ప్రైవేటు రంగానికి అప్పచెప్పింది. పని భారము, ఆర్థిక సమస్యలు, మార్కెట్ ఒడిదుడుకుల కారణంగా నూతన మధ్యతరగతికి చెందినవారు విపరీతమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. తలిదండ్రులిరువురూ వుద్యోగులైనపుడు పిల్లల పెంపకం వివాదాలకు కారణమవుతున్నది. ఇలాంటి పరిస్థితులలో డాక్టర్లేకాక రకరకాల మతగురువులు -స్వాములు, బాబాలు- కూడా ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నారు. కొంతమంది వుపశాంతిని పొందినా, మతతత్వ శక్తులు మాత్రం యీ విశ్వాసాలను తమకు అనుకూలంగా మలచుకుంటున్నాయి. ప్రస్తుతం పురోగామి సంస్కృతికీ, నిజమైన ఆధ్యాత్మిక విలువలకూ కొరత ఏర్పడింది. ఈ పరిస్థితులలో యథార్థమైన సజీవ ప్రజా సంస్కృతిని అందచేయడం మన బాధ్యత.

**సైద్ధాంతిక ప్రభావం**

అంతర్జాతీయంగా, మేధోప్రపంచంలో మార్క్సిస్టు వ్యతిరేక, వామపక్షేతర భావజాలం ఆధిక్యతలో వున్నది. మన దేశంలో సైతం తిరోగామి భావజాలం ఆదరణను, ప్రోత్సాహాన్ని అందుకుంటున్నది. వామపక్ష వుద్యమం బలహీనంగా వుండటంతో ప్రగతిశీల భావజాల వ్యాప్తి అసంతృప్తికరంగా వున్నది.

నయా వుదారవాద విధానాలను మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టినపుడు తరుణ వయస్కులుగా వున్నవారు యిప్పుడు మధ్యవయస్కులుగా వున్నారు. వారిపై ఆ విధానాల ప్రభావం వున్నది. దానితోపాటే అంతకుముందు వ్యాప్తిలో వున్న భావాల ప్రభావం వున్నది. వారు అనేక వుద్యమాలకు సాక్షీభూతంగా వున్నారు, అయితే వాటిలో వారికి ఏమాత్రం విశ్వాసం లేకపోవచ్చు. వారు అదే ధోరణిలో వున్నప్పటికీ వారి ఆకాంక్షలలో మాత్రం మార్పు వచ్చింది. అందివచ్చిన కొత్త అవకాశాలను వుపయోగించుకుని తమ అదనపు సమయాన్ని ధనార్జనకు వుపయోగించాలని కోరుకుంటున్నారు. వారిపైన ప్రసారమాధ్యమ ప్రభావమూ, కులమత రాజకీయాల ప్రభావమూ బలంగా వున్నది. బలమైన యూనియన్లు వున్న బ్యాంకింగ్, బీమా, బోధన తదితర రంగాలలో చాలా సంవత్సరాలుగా పెద్దగా నియామకాలు లేవు. కొత్తగా నియమితులైన వారికి (కాంట్రాక్టు లేదా దినసరి వేతన శ్రామికులు) కార్మికసంఘ వుద్యమంతో పెద్దగా సంబంధాలు లేవు. ఈ నూతన శ్రామికులకూ, మన కార్మిక సంఘ నాయకులకూ మధ్య అంతరం వున్నది. దీని ఫలితమే వారు రాజకీయరహితంగా మిగిలి పోవటం.

సంస్కరణల శకం ప్రారంభమైనపుడు జన్మించిన వారు యిప్పుడు యువకులుగా వున్నారు. ఇదివరకటి వుద్యమాల, రాజకీయాల ప్రభావం వారిపై పెద్దగా లేదు. క్రీడారంగంలోనూ, చలనచిత్ర రంగంలోనూ ప్రముఖులుగా వున్నవారి ప్రభావం వారిపై అధికంగా వున్నది. వీడియో గేమ్స్, బార్బీ బొమ్మలు, బెన్10, ఛోటాభీమ్ వంటివాటితోపాటు వినియోగాన్ని పెంచే వ్యాపార ప్రకటనలు, సంపదను కోరే సంస్కృతీ ప్రభావం కూడా వారిపై బలంగా వున్నది. సౌందర్యంపట్ల ఆపేక్ష, మేకప్, ఫ్యాషన్ వగైరాలు చిన్నతనం నుంచి ఆకర్షిస్తూనే వున్నాయి. అమెరికా, పశ్చిమ దేశాలు వీరికి ఆకర్షణగా నిలచాయి, సైద్ధాంతికంగా కూడా ప్రభావితం చేస్తున్నాయి. పెట్టుబడిదారీ, ఫ్యూడల్ భావాలు ఒకదానికొకటి ముడివేసుకున్నాయి.

ప్రభుత్వ విధానాలకూ, ఆర్థిక విధానాలకూ మధ్యవున్న సంబంధం మరుగున పడుతున్నది, యీ రెండు వేర్వేరు అన్నట్లుగా చూస్తున్నారు. దీనివల్ల యీ విధానాలకు సత్పరిపాలన తోడైనట్లయితే అది అభివృద్ధికీ, పురోగతికీ దారితీయగలదన్న భ్రమలు కలుగుతున్నాయి. ఈ కట్టుకథను వ్యాపింప చేయటంలో పాలక వర్గాలు

సఫలమయ్యాయి. దారిద్ర్య నిర్మూలన పథకాలన్నిటినీ దూరంగా వుంచాలని నయా వుదారవాద సిద్ధాంతవేత్తలు భావిస్తున్నారు. ఇందుకుగాను అంతకంతకూ ఎక్కువమంది మధ్యతరగతి ప్రజలు ముందుకువచ్చి సంపన్నులకు ఓటువేసేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

ఏదియేమైనప్పటికీ, క్రమక్రమంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. యువజనులలో రాజకీయాలపట్ల ఆసక్తి పెరుగుతున్నది. రాజకీయ నాయకులపట్ల తమ విముఖతనూ, పదిహేనేళ్ళ క్రితం వ్యాప్తిలో వున్నట్లుగా ఓటు వేయటంపట్ల అనాసక్తతనూ వారు విడిచిపెడుతున్నారు. అసంతృప్తి, అలజడి వారిలో ఎక్కువవుతున్నది. వ్యవస్థపై వారు దాడి చేయటానికి ముందే వారిని దగ్గరకు తీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పాలక పార్టీల నాయకులు తమ పిల్లలను యువనాయకులుగా ప్రజలలోకి తీసుకు వస్తూ, నాయకత్వంలో తరాల మార్పుపట్ల తమకు ఆసక్తి వున్నట్లుగా చెపుతున్నారు. యువతను ఆకర్షించటానికి అన్ని పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. వారి మద్దతు సంపాదించటానికై యువతలో వున్న ఆకాంక్షలను వుపయోగించుకుంటున్నారు. తమకు ద్రోహం జరిగిందనీ, అభివృద్ధి, వుపాధి గురించి తమకున్న ఆశలు వాస్తవరూపం దాల్చలేదన్న విషయాన్ని ఒక్కసారిగాని యువజనులు గుర్తించినట్లయితే వారు స్పందించి ముందంజ వేస్తారు.

***సినిమాలు–టెలివిజన్***

పేద, దిగువ మధ్యతరగతి ప్రజల జీవితాలను చిత్రించిన భారతీయ చిత్రాలు ప్రస్తుతం ఎగువ మధ్యతరగతి, సంపన్నుల జీవితాలను చిత్రిస్తున్నాయి. మధ్యతరగతి, ప్రత్యేకించి మహిళల ఆకాంక్షలను, స్వప్నాలను యివి ప్రతిబింబిస్తున్నాయి. అనేక సందర్భాలలో వార్తలకూ, కిరాయి వార్తలకూ మధ్య తేడాలు చెరిగిపోతున్నాయి.

***ఆలోచనా విధానంపై ప్రత్యేక ప్రభావం***

కమ్యూనికేషన్ల రంగంలో వాస్తవాల స్థానంలో కల్పనలు చోటుచేసుకుంటున్నాయి. పాత తరానికి చెందిన వారు దీనిని అర్థం చేసుకోలేరు. సాంకేతిక పరిజ్ఞానం వచ్చి వ్యక్తులను ఏకాకులను చేస్తున్నదని భావిస్తారు.

***ఇంటర్నెట్–సామాజిక మాధ్యమం***

కొత్తతరంలో ఇంటర్నెట్ అందుబాటు చాలా ఎక్కువగా వున్నది. మొబైల్ ఫోన్‌లకు బ్రాడ్‌బాండ్, ఇంటర్నెట్ కనెక్టివిటి పెరుగుదల, తక్కువ ధరలకే స్మార్ట్ ఫోన్‌ల లభ్యత కారణంగా యిది సాధ్యమైంది. ఐటియు లెక్కల ప్రకారం మొబైల్ ఇంటర్నెట్ వినియోగదారులు 2011 మార్చిలో 2.60 కోట్లమంది వుండగా, 2013 నాటికి యీ సంఖ్య 8 కోట్లకు చేరింది. ఈ సౌకర్యాన్ని అందుకోగల మరో 42.70 కోట్ల ఫోన్‌లు వినియోగంలో వున్నాయి. అయితే యిప్పటి వరకు వీటి వినియోగదారులు

నెట్ కనెక్షన్ తీసుకోలేదు. పాశ్చాత్య దేశాలతో లేదా చైనాతో పోల్చుకుంటే భారతదేశంలో నెట్ కనెక్షన్‌లు చాలా తక్కువ.

ప్రసారమాధ్యమం, ప్రత్యేకించి సామాజిక మాధ్యమం యొక్క ప్రభావం యువతరంపై చాలా ఎక్కువగా వున్నది. తాజా విషయాల కోసమూ, సంబంధాలను ఏర్పరచుకోవడానికీ దీనిపైనే ఆధారపడుతున్నారు. పట్టణ యువజనులలో ఎక్కువమంది ఇంటర్నెట్‌తో సంబంధాన్ని కలిగివున్నారు. మిత్రులతో సంబంధాలు కలిగి వుండటానికీ, కొత్త స్నేహితులను ఏర్పరచుకోవటానికీ సామాజిక మాధ్యమం ఒక సాధనంగా వున్నది. వారి మధ్య సామాజిక, రాజకీయ భావాలు వ్యాప్తి చెందడానికి కూడా యిదొక ప్రధానమైన సాధనంగా మారింది.

**ఆటలు**

వాణిజ్య ప్రకటనలకు పిల్లలు, కౌమార వయస్కులు లక్ష్యంగా మారుతున్నారు. వారిని లక్ష్యంగా పెట్టుకునే ఆటలను రూపొందిస్తున్నారు. దేశం ప్రస్తావన ఏమాత్రం వుండదు. దృష్టి మొత్తం వ్యక్తిపైనే కేంద్రీకృతమౌతుంది. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలోని యువతలో కనిపించే అరాచక ధోరణులు యిటువంటి వాటి ప్రభావమే. మొదట్లో ఏర్పడిన భావజాలాన్ని, ధోరణులను తొక్కివేయడంలో వారు సఫలమయ్యారు. ఈ పరిశ్రమ సృష్టించిన నూతన సంస్కృతి అత్యంత కీలకమైనది. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతను మలచటమే ఇంటర్నెట్, మొబైల్ ఫోన్, టాబ్, ఐపాడ్‌లలో ఆటల వేలం వెర్రిని సృష్టించడంలోని ఆంతర్యం. వీడియో గేమ్స్ కూడా మొబైల్ ఫోన్‌లోకి అందుబాటులోకి వచ్చాయి.

స్మార్ట్‌ఫోన్‌ల ధర రూ.2000లకు దిగి రావటంతో దిగువ మధ్యతరగతి వారికి, పేదలకు కూడా అందుబాటులోకి వచ్చినట్లయింది. ఇప్పుడున్న అన్ని తరగతుల పిల్లలు కౌమార దశకు వచ్చేసరికి మార్కెట్ శక్తులకు అనుగుణంగా తయారయ్యేలా యీ నూతన సంస్కృతి వారిని తీర్చిదిద్దుతున్నది.

వాణిజ్య ప్రకటనలు ఏ స్థాయికి వెళ్ళాయంటే ఒకే కనెక్షన్ నుంచి వినియోగిస్తున్న ఇంటర్నెట్‌ను యిరువురు ఒకే విషయాన్ని వీక్షిస్తున్నపుడు రెండు విభిన్నమైన వాణిజ్య ప్రకటనలను చూడటం జరుగుతున్నది. వాణిజ్య ప్రకటనలను తయారుచేసే కంపెనీలు తమ వారి ద్వారా వినియోగదారుల సమాచారాన్ని రాబడతాయి.

**ధార్మికత-సేవా కార్యక్రమాలు**

యువతలో యీనాడు దాతృత్వం, సేవాభావం, ధార్మికత పెరుగుతున్నాయి. ఇది ఆహ్వానించదగిన పరిణామం. మార్పు కావాలన్న కోరికను యిది వ్యక్తం చేస్తున్నది. స్వచ్ఛంద సంస్థలపట్ల ఆసక్తిని పెంచటానికి యిది దారితీయవచ్చు. అమెరికాలో

ప్రచలితమైన ఐస్ బకెట్ ఛాలెంజ్, భారతదేశంలో ప్రచారానికి వచ్చిన రైస్ బకెట్ ఛాలెంజ్‌లను యిందుకు వుదాహరణగా చెప్పవచ్చు. ధార్మికత కోసం, పేదలకు ఆహారం కోసం నిధులను పోగుచేయటం వీటి వుద్దేశం. ఇవి రెండూ విపరీతమైన ప్రచారాన్ని అందుకున్నాయి. విరాళాల సేకరణకూ, ధార్మికతకూ సృజనాత్మకమైన మార్గాలను ఆచరణలోకి తెచ్చుకోవాలి. ఇదేవిధంగా అవయవ, శరీర దానాలపట్ల ఆసక్తి పెరుగుతున్నది, దీనికి మనం వుద్యమ రూపాన్ని కల్పించాలి.

***పండుగలు మరియు వేర్వేరు 'దినములు'***

సంప్రదాయకమైన పండుగలతోపాటు, రకరకాలైన దినములు, అంటే తల్లులు, తండ్రులు, సోదరులు, జన్మదినములు, స్నేహితులు, ప్రేమ వగైరాలకు సంబంధిచినవి పెరుగుతున్నవి. ఇవన్నీ కూడా బహుమతులు కొనుగోలు చేసే సందర్భాలు అయినందున వీటన్నిటినీ మార్కెట్ శక్తులే ప్రచారంలోకి తీసుకువస్తున్నాయి. కాగా, తన విస్తరణ కోసం బిజెపీ సంప్రదాయ పండుగలను వినియోగించుకుంటున్నది. అయితే అది హిందూ సంస్కృతి పేరిట 'వాలెంటైన్ డే' వంటివాటిని వ్యతిరేకిస్తున్నది. కాని, పలువురు యువజనుల నుంచి దీనికి ప్రతికూల ప్రతిస్పందన వస్తున్నది.

***అస్తిత్వ రాజకీయాల ప్రభావం***

అస్తిత్వ రాజకీయాల ప్రభావం కేవలం సామాజికంగా అణగారిన దళితులవంటి వారికే పరిమితంకాక ఓబిసీ, ముస్లింలకు కూడా పాకింది. ఈ తరగతులన్నీ మతం పేరుతో ఏకతాటిపైకి రాజాలవని గ్రహించిన ఆరెస్సెస్, హిందూత్వ శక్తులు, హిందూత్వ చట్రంలో కులాన్ని వుపయోగించేందుకు కుతంత్రాలు పన్నసాగాయి. చరిత్రను వక్రీకరించడం ద్వారా విద్యాధిక, మధ్యతరగతి దళితుల్లోకి చొచ్చుకు వెళ్ళేందుకు వారు వ్యూహాలు రచిస్తున్నారు. సంఘటిత కార్మిక వర్గ వుద్యమాలు, సామాజిక వుద్యమాలు మాత్రమే అస్తిత్వ రాజకీయాల ప్రభావాన్ని తగ్గించగలవు.

***న్యాయవ్యవస్థ పాత్ర***

ఇటీవల కార్మిక వర్గ వ్యతిరేక, స్వాభావికంగా ప్రజాస్వామ్య వ్యతిరేకమైన తీర్పులు వెలువడ్డాయి. సమ్మెలపై నిషేధం వంటి యిలాంటి తీర్పును మధ్యతరగతి స్వాగతించింది. ఆర్‌టిఐ, ఎన్నికలు, రాజకీయ పార్టీలు, అవినీతి వగైరాల గురించి ప్రకటనలు చేయడం ద్వారా యీ తరగతిని ప్రభావితం చేసింది.

**వైరుధ్యాలు**

ఈ తరగతి ప్రజల వద్దకు చేరే కచ్చితమైన నినాదాలను రూపొందించేటందుకుగాను, మధ్యతరగతిలోని విభిన్న తరగతుల మధ్య వున్న

వైరుధ్యాలను గుర్తించాలి.

***ప్రజల మధ్య***

*మురికివాడలు–మధ్యతరగతి (ప్రత్యేకించి ఎగువ స్థాయికి చెందినవారు)*

అలజడులకు, అపరిశుభ్ర పరిసరాలకు, సుందరీకరణ జరగకపోవటానికీ, దొంగతనాలకు, నేరాలకు, యితర సామాజిక చెడుగులకు మురికి వాడలే కారణమని మధ్యతరగతి భావిస్తుంది. మినహాయింపులతో కూడిన పట్టణీకరణ నమూనాలకు మధ్య తరగతి మద్దతు పలకటానికి యిదే కారణం. పేదలకు యిచ్చే సబ్సిడీలపట్ల కూడా మధ్యతరగతిలో వ్యతిరేకత వున్నది. శ్రామిక వర్గం పాటించే బందులను, సమ్మెలను వారు వ్యతిరేకిస్తారు.

***వీధి వ్యాపారులు–దుకాణదారులు***

తమ వ్యాపారాలకు వీధుల్లో తిరుగుతూ అమ్మేవారు పీడగా తయారయ్యారని దుకాణదారులు భావిస్తారు.

***ఉద్యోగులు, ఉపాధ్యాయులు–ప్రజలు***

ప్రభుత్వ పాఠశాలలల్లో తరచుగా ఉపాధ్యాయులు కనిపించకపోవటం, దూరం నుంచి వచ్చిన ప్రజలకు వుద్యోగులు సరిగ్గా సమాధానం చెప్పకపోవటం, ప్రజలకు అందుబాటులో లేకపోవటంతోపాటు అధికార యంత్రాంగంలోనూ, స్థానిక స్థాయిలోనూ అవినీతి వుండటంపట్ల ప్రజలలో ఆగ్రహం పెల్లుబుకుతున్నది.

***రాజ్యవ్యవస్థతో***

అధికార యంత్రాంగం, రియల్ ఎస్టేట్ తదితర మాఫియాలతో కుమ్మక్కు అవడంవలన మధ్య తరగతి, పేద ప్రజలకు వారితో వైరుధ్యం ఏర్పడుతుంది. ఆ సమస్యలను చేపట్టడం వలన మనం మధ్య తరగతి పేద ప్రజలను ఐక్యంచేయవచ్చు.

✶ రియల్ ఎస్టేట్ తదితర మాఫియాతో పాలక యంత్రాంగం కుమ్మక్కు కావటం తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నది, ఇది సమస్యలను చేపట్టటంలో మధ్యతరగతిని, పేదలను ఐక్యం చేయగలదు.

✶ పౌర సదుపాయాలకు సంబంధించి ప్రభుత్వంతోనూ, తాగునీరు, పారిశుద్ధ్యము, విద్యుత్, ప్రజా పార్కులు వంటివి సమస్యలుగా వున్నాయి.

✶ వార్డు సభ్యునినుంచి మంత్రివరకూ, గృహనిర్మాణం మొదలుకొని అనుమతులు పొందవలసిన అన్ని స్థాయిలలోనూ రాజకీయ అవినీతి నిండివున్నది.

✶ పన్నులు, వినియోగ ఛార్జీలు తదితరాల ద్వారా ఆర్థిక భారాలు.

✶ మౌలిక అనుమతులు, సర్టిఫికెట్లు పొందే క్రమంలో జాప్యం.

✶ ప్రత్యేక ఆర్థిక మండలాల కోసమూ, రహదారుల కోసమూ భూసేకరణ, వలన వారి ఇళ్ళు ఇతర నిర్మాణాలు అన్యాక్రాంతమవుతున్నాయి.

★ ప్రజాతంత్ర హక్కులు:సామాజిక మాద్యమంపైనా, విజ్ఞానంపైనా ఆంక్షలకూ, నిషేధానికీ వ్యతిరేకంగా,

**కార్పొరేట్లతో**

★ ప్రజల ఆరోగ్యానికి భంగం కలిగించే పారిశ్రామిక, రసాయన కాలుష్యం, ఔషధ, జీవ వ్యర్థాలు,

★ ఉద్యోగుల పనిపరిస్థితులు, వేతనాలు, కార్మిక చట్టాల అమలు;

★ సహజవనరుల దుర్వినియోగం, అవినీతి పద్ధతులు

★ పేటెంట్, కాపీరైట్‌లకు వ్యతిరేకంగా (విజ్ఞానానికి స్వేచ్ఛ).

***మన అనుభవం***

అవినీతి వ్యతిరేక, నిర్భయ ప్రదర్శనలలో యువజనులు పెద్దసంఖ్యలో పాల్గొనటాన్ని మనం చూశాము. మార్పులు సంభవిస్తున్నట్లుగా యివి సూచిస్తున్నాయి. హైదరాబాదులో వుచిత సాఫ్ట్‌వేర్ వుద్యమంలో పనిచేస్తున్న బృందం తీసుకున్న చొరవ దాని సభ్యులకు విలువైన అనుభవాన్ని మిగిల్చింది. అమ్మాయిలతోసహా వున్నత విద్యాధికులతోనూ, వుత్సాహవంతులైన యువజనులతోనూ సంబంధాలు పెట్టుకోవటానికి దోహదపడింది.

***అంతర్జాతీయ అనుభవం***

అనేక దేశాలలో వినియోగదారీ వ్యతిరేక వుద్యమాలు కార్పొరేట్ వ్యతిరేక వుద్యమంగా మార్పు చెందాయి (ఉదాహరణకు ఓడబ్ల్యుఎస్). ప్రచారానికి సాధనంగా అనామక మెయిళ్ళను వినియోగిస్తున్నారు. ఈ ప్రచారాన్ని అజ్ఞాత వ్యక్తులు, వామపక్షవాదులు, అరాచకవాదులు, రకరకాల వ్యక్తులు ఈ వ్యతిరేక ప్రచారాన్ని ప్రారంభించారు. వారు 1 శాతానికి వ్యతిరేకంగా ఐక్యమయ్యారు. ఉద్యమాన్ని ప్రారంభించి విషయాన్ని జాతీయ స్థాయికి తీసుకువెళ్ళారు. అరబ్ తిరుగుబాట్లలో మౌలిక విషయాలపట్ల ప్రజలలో పెరిగిన ఆగ్రహం చిన్నఘటనతో రాజుకుని బహుళ నిరసన ప్రదర్శనలుగా మారాయి. కిందిస్థాయి సంస్థలు వుత్ప్రేరకాలుగా పనిచేశాయి. లాటిన్ అమెరికాలో ప్రజా, సామాజిక వుద్యమాల నుండి నూతన శక్తులు పుట్టుకువచ్చి సామ్రాజ్యవాదానికీ, నయా వుదారవాద విధానాలకూ వ్యతిరేకంగా విశాల ప్రాతిపదిక కలిగిన జాతీయస్థాయి వుద్యమాలను ముందుకు తెచ్చాయి. ఈ అనుభవాలను అధ్యయనం చేసి నిర్మాణాత్మక గుణపాఠాలను తీయవలసి వున్నది.

***ప్రస్తుత పరిస్థితిపై అంచనా***

2010లో ఆర్థిక పరిస్థితి మందగించిన అనంతరం యువతలో అసంతృప్తి పేరుకోవడం ప్రారంభమైంది. ఉద్యోగావకాశాలు కోల్పోవడం అభద్రతను పెంచింది. కచ్చితమైన నినాదాలను రూపొందించగలగడంతో మోడీ రాజకీయంగా ప్రయోజనాన్ని

పొందగలిగాడు. మోడీగురించి అంచనాలు తారాస్థాయికి చేరాయి. అభివృద్ధి అన్న ఆయన నినాదం పారిశ్రామికీకరణ, ఉపాధికి దారితీయగలదన్న నమ్మకాన్ని పెంచింది. ఆయన ప్రధాన మంత్రి పదవిని చేపట్టిన తరువాత వేర్వేరు నినాదాలతో యువతను ఆకర్షించటానికి ప్రయత్నించాడు. ఉపాధి కల్పన కీలకమైనది, యిందుకుగాను పట్టణీకరణపైనా, పారిశ్రామికీకరణపైనా (వస్తుతయారీ) దృష్టి నిలపవలసి వుంటుంది. అయితే, అవసరమైన ఎదుగుదలకు ఆర్థికవ్యవస్థ వీలు కల్పించటంలేదు. అసమ్మతి బద్దలయ్యే స్థితి ఏర్పడింది. పని ప్రదేశాలలో జనసమీకరణను వూహించలేము, ఎందుకంటే ఎక్కువమంది వుద్యోగులు సంతృప్తితో వున్నారు, యాజమాన్యాల కార్యనిర్వహణ పద్ధతి సఫలమైంది.

అభద్రతా భావన, పనిసంబంధమైన ఒత్తిడి పెరుగుతున్నది. లక్ష్యసాధనలో వెనుకబాటుతోపాటే నిరర్థకులన్న ముద్రపడితే తత్ఫలితంగా తొలగింపులు వుంటాయన్న భయం పెరుగుతున్నది. గుండెపోటుతో బాధపడే 30 ఏళ్ళలోపు వారిలో 80 శాతంమంది పరిస్థితి ఇదేనని హృద్రోగ నిపుణులు కనుగొన్నారు. మానసిక వైద్యులు కౌన్సిలింగ్ యిస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. పనిసంబంధమైన ఒత్తిడిపాటు యితర ఒత్తిళ్ళు కూడా జోడవటంతో ఆత్మహత్యలు కూడా పెరుగుతున్నాయి. ఇంతకుముందే పేర్కొన్నట్లుగా వీరిలో అనేకమంది ఖర్చుదారులు అయినందువలన నెలసరి వాయిదాల చెల్లింపుల చాలా ఎక్కువ అవుతున్నాయి. వడ్డీరేట్లు, ధరలు తదితరాలను పెంచటంద్వారా వారికి వచ్చే అధిక ఆదాయాలలో గణనీయమైన భాగాన్ని కార్పొరేట్ రంగం తిరిగి వెనక్కు లాక్కుంటున్నది. తొలుదొల్తటి వృద్ధి గ్రామీణ ప్రాంతంలోని కొన్ని తరగతులకు అయినా లబ్ది చేకూర్చింది. భూమి ధరలు అధికంగా పెరగటంలో యిది ప్రతిబింబిస్తున్నది. కాగా యిప్పుడు గ్రామీణ రంగానికి ఒనగూడే ప్రయోజనాలు కూడా తగ్గాయి.

నిరుద్యోగులకు వుద్యోగావకాశాలు తగ్గటం, అర్హతకు తగిన వుద్యోగాలు లభించకపోవడం, పెరుగుదల క్షీణతకు అవినీతి జోడై తరచుగా ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంతో జతకూడటం అనేవి యీ తరగతిలో పునరాలోచనకు ప్రధాన కారణాలుగా వున్నాయి. అవినీతికీ, మహిళలపై సాగుతున్న హింసకూ వ్యతిరేకంగా సాగే వుద్యమాలలో పాల్గొనటమే యిందుకు రుజువు. విధానాల గురించీ, రాజకీయాల గురించీ ఆలోచించటాన్ని విరమించుకున్న యువత ప్రస్తుతం వాటిపై దృష్టిని సారిస్తున్నది.

మధ్యతరగతిలో జాగృతిని పెంచటం అంత తేలికకాదు, అయితే, ఎవరైతే ప్రశాంత జీవనాన్ని గడుపుతున్నారో వారిప్పుడు ఆర్థిక సంక్షోభ ఫలితాలను ఎదుర్కొంటున్నందున యిప్పుడది సాధ్యమవుతుంది. 2010 వరకు సాపేక్షకంగా

చూసినట్లయితే వివిధ సేవారంగాలలో వుద్యోగాలను పొందటం సులభంగా వుండేది. ఇప్పుడిది కుదించుకుపోయింది. ఉద్యోగాలు చేస్తున్న వారు తొలగింపు గురించి భయపడుతున్నారు. పొదుపు మొత్తాలు ఆవిరైపోవటానికి ద్రవ్య సంక్షోభం కారణమవుతుంది. షేర్ మార్కెట్ కుప్పకూలటంతో గత ఐదు సంవత్సరాల కాలంలో మధ్యతరగతి మదుపుదారులు కోట్ల రూపాయలు నష్టపోయారు. తట్టుకోలేని వారు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. స్థిరత్వ సాధన ప్రస్తుతానికి అసాధ్యంగా కన్పిస్తున్నది. మార్పును కోరుకోవటానికి యిదే ప్రాతిపదికగా వున్నది. నియంతృత్వ ప్రభుత్వమే యీ పరిస్థితిని చక్కదిద్దగలదని కొందరు భావిస్తుంటే సామాజిక వుద్యమాలే దీనికి పరిష్కారమని మరికొందరు భావిస్తున్నారు.

భవిష్యత్తులో ప్రజావుద్యమాల పెరుగుదలకు సానుకూలమైన భౌతిక పరిస్థితులను యిప్పటి యీ పరిస్థితులు సృష్టిస్తాయి. సమర్థవంతమైన జోక్యానికిగాను మనం కచ్చితమైన నినాదాలను, వ్యూహాలను రూపొందించుకుని యువత ముందు రాజకీయ ప్రత్యామ్నాయాన్ని వుంచవలసి వుంటుంది.

***మన జోక్యాలు***

***పట్టణ మధ్యతరగతి సమస్యలు***

ప్రజలను ఆకట్టుకోవటంతోపాటు, ఎంతోకొంత సాధించుకోగలమన్న విశ్వాసాన్ని వారిలో పాదుకొల్పేలా కచ్చితమైన డిమాండ్లను మనం రూపొందించగలగాలి. విద్య, వుద్యోగము, ఆరోగ్యము, గృహవసతి, పన్నులు, పౌర సదుపాయాలు, ప్రజాతంత్ర హక్కులు, స్త్రీలకు భద్రత, పర్యావరణము వంటివి ప్రధానమైన అంశాలుగా వున్నాయి. ప్రతి అంశంపైనా సరైన సమయంలో నినాదాలను రూపొందించుకోవాలి.

***1. ప్రధానమైన కొన్ని సమస్యలు***

***ఉద్యోగాలు***

★ ప్రభుత్వ విభాగాలలోనూ, ప్రభుత్వరంగ సంస్థలల్లోనూ ఖాళీలు, బాక్‌లాగ్ పోస్టులు, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు, నైపుణ్యాభివృద్ధి, నియామక సంబంధిత సమస్యలు, ప్రభుత్వ సంస్థల ద్వారా ప్రైవేటురంగ నియామకాలు. ప్రైవేటు కన్సల్టెన్సీల నియంత్రణ.

★ వీసా సంబంధిత సమస్యలు,

***2. అభివృద్ధి సమస్యలు***

★ రహదారులు–సంబంధాలు

★ వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు

★ దళితులు, వివిధ తెగల ప్రజలు నివసించే ప్రదేశాల అభివృద్ధి

★ పట్టణాభివృద్ధికి మౌలిక సదుపాయాలు

★ సేద్యము – విద్యుత్తు

★ డిజిటల్ ఐక్యత (అందరికీ ఇంటర్నెట్ కనెక్షన్లు),

***3. పని పరిస్థితులు*** కార్మిక చట్టాల అమలు, వేతనాలు, ఉద్యోగ భద్రత, మధ్యవర్తిత్వ యంత్రాంగం, ఒత్తిడిని తగ్గించే కేంద్రాలు

***4. విద్య*** ఆర్‌టిఇ అమలు ప్రైవేటు సంస్థలలో ఫీజుల నియంత్రణ, కోచింగ్ కేంద్రాల నియంత్రణ

***5. ఆరోగ్యము*** ప్రజారోగ్యాన్ని పటిష్టపరచడం, అందుబాటులో ప్రయోగశాలలు, కార్పొరేట్ ఆసుపత్రుల నియంత్రణ, అత్యవసర సర్వీసుల అందుబాటు.

***6. గృహవసతి*** అందుబాటులో ఇంటిధరలు, రియల్ ఎస్టేట్ నియంత్రణ (2013 బిల్లు అపరిష్కృతంగా వున్నది), గృహ నిర్మాణ రుణాలపై వడ్డీ రేట్ల స్థిరీకరణ, ప్రభుత్వ పథకాల సత్వర అమలు, ప్రభుత్వ పథకాల కింద నాణ్యమైన గృహాలు.

***7. ఆక్రమణలు*** ఈ కాలంలోనే రియల్టర్లు, మాఫియా కలసి ప్రైవేటు ఆస్తులను, ప్రభుత్వ ఆస్తులను కబ్జాచేశారు. బలిపశువులుగా మారిన మధ్య తరగతికి చెందిన వారు, పేదలు స్థానిక రాజకీయవాదులను ఆశ్రయించవలసి వచ్చింది. వాస్తవానికి యీ రాజకీయవాదులు రియల్టర్లతోనూ, మాఫియాతోనూ సంబంధాలు కలిగివుండి బాధితులకు అన్యాయం చేస్తున్నారు. ఇలాంటి రాజకీయవాదులే ప్రజలలో తమ పలుకుబడిని పెంచుకుంటున్నారు. ప్రభుత్వాలిచ్చే తప్పుడు డాక్యుమెంట్లను యీశక్తులు చక్కగా వినియోగించుకుంటున్నాయి. ఇవి వ్యక్తిగత సమస్యలుగా కన్పించినప్పటికీ, స్పష్టమైన చట్టాలను, చర్యలను చేపట్టాలని ప్రభుత్వాన్ని మనం డిమాండు చేయవచ్చు.

★ ప్రభుత్వ స్థలాలను నామమాత్రపు ధరకు 99 సంవత్సరాలపాటు అద్దెకు యివ్వటం ద్వారా ఆ స్థలాలను ఆక్రమించే అవకాశాన్ని అధికారికంగానే కల్పించినట్లవుతున్నది.

★ పట్టణాలలో పబ్లిక్ పార్క్‌లను, ఉమ్మడి స్థలాలతోసహా ఆక్రమించటానికి రాజకీయ నాయకులు, అధికారులు, లాండ్ మాఫియా కుమ్మక్కవుతున్నారు. నీటికుంటలు, చెరువులు, నదీతీరాలు, ప్రభుత్వ ఆస్తులను కూడా కొల్లగొడుతున్నారు. దిగువ మధ్యతరగతికి, పేదకుటుంబాలకు చెందిన వారిని ఖాళీచేయించి మరీ ఆక్రమిస్తున్నారు.

***8. పన్నులు***

★ ఆదాయపు పన్నును క్రమబద్ధీకరించాలి, పన్ను పరిధిని పెంచాలి (10 లక్షల వరకు), కార్పొరేట్ పన్నులకు, సంపద పన్నుకు సంబంధించిన వాటిని వసూలు చేయాలి.

***9. పౌర సదుపాయాలు***

త్రాగునీరు, విద్యుత్, మురుగునీటి పారుదల వ్యవస్థ, ఉద్యానవనాలు, రవాణా, నీటిసరఫరా సంస్థలను నిర్వహిస్తూ కాపాడుకోవాలి.

★ వినియోగ ఛార్జీలు, టోల్‌గేట్ ఛార్జీలు

★ క్రీడా మైదానాలు, వినోద కేంద్రాలు, ఈతకొలనులు, పిల్లల పార్కులు

★ అన్నిరకాల సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో వుంచటం

★ శుద్ధిచేసిన త్రాగునీటి సరఫరా (ఒక కుటుంబానికి రోజుకు 20 లీటర్లు)

*పట్టణ సంబంధమైన సమస్యలు*

★ టౌన్ ప్లానింగ్, నగర ప్లానులు, మురికివాడల అభివృద్ధి, వీధివ్యాపారులు

★ రాకపోకల సౌకర్యాలు, ప్రభుత్వ రవాణా సాధనాలు, రాయితీలపై పాసులు, పుట్‌పాత్‌లు, సైకిలు దారులు

***10. పర్యావరణము, కాలుష్యము***

★ పర్యావరణపరంగా పరిశుభ్రమైన, హరిత నగరం

★ చెత్త సేకరణ, దాని నిర్వహణ

★ నీటికుంటలను, చెరువులను నిర్వహించటం

★ పారిశ్రామిక, రసాయన, వైద్య, జీవ వ్యర్థాలను శుద్ధిచేయటం

★ పట్టణ సామాజిక అడవులు, హరిత ప్రాంతాలు

★ ఇంకుడు గుంటలు

*ప్రజాస్వామ్యము-వికేంద్రీకరణ*

★ వికేంద్రీకరణ, భాగస్వామ్యము, సత్పరిపాలన, పట్టణ స్థానిక సంస్థల

**11. ప్రజాతంత్ర పనివిధానము**

★ దామాషా ప్రాతినిథ్య పద్ధతిన ఎన్నికల సంస్కరణలు జరగాలని

**పోలీసుల వేధింపులు వ్యతిరేకంగా**

★ ప్రాతినిథ్య బడ్జెట్‌కు డిమాండు

**12. వుచిత విజ్ఞాన సమాజం కోసం సాఫ్ట్‌వేర్‌ను అందచేయటం**

సమష్టి విజ్ఞాన కేంద్రాలను స్థాపించటం, ఔషధ పరిశ్రమ, జీవసాంకేతిక విజ్ఞాన భద్రత వంటి చోట్ల వీటిని ఏర్పాటు చేయటం.

**13. రక్షణ**

★ స్త్రీలకు రక్షణ, ప్రత్యేక బస్సు సర్వీసులు, సమర్థవంతమైన అలారం వ్యవస్థలు

★ పేద, మధ్యతరగతి ప్రజల ప్రైవేటు ఆస్తికి రక్షణ

★ కులాంతర వివాహాలు చేసుకునే వారికి రక్షణ, ప్రోత్సాహం

* అసాంఘిక శక్తుల నుండీ, నీచుల నుండి రక్షణ

***14. ధరల పెరుగుదల***

* అత్యవసర సరకుల ప్రజాపంపిణీ వ్యవస్థ, రేషన్ కార్డులు
* ఆహార, పానీయాల నాణ్యతను కాపాడటం

***15. ఇతరములు***

* స్టాక్ మార్కెట్ వూగిసలాటలు
* వృద్ధుల సమస్యలను చేపట్టటం
* ఎల్‌జిబిటి హక్కుల గుర్తింపు

***ఆందోళనా పద్ధతులు***

క్షేత్రస్థాయి వుమ్మడి ఆలోచనా పద్ధతులు బృందస్ఫూర్తిని పెంచుతాయి. ఉదాహరణకు, ఆకస్మికంగా ప్రజలు గుమిగూడటం, ఆన్ లైన్ ఫిర్యాదులు, సామాజిక మాధ్యమం, బృందగానం, నృత్యాలు, సంగీతం, లఘుచిత్రాలు, ఆర్‌టిఐ, పిఐఎల్‌ను వుపయోగించడం, ప్రత్యామ్నాయ ప్రసారమాధ్యమాన్ని ప్రోత్సహించడం.

***చొరవ***

సేవాకార్యకలాపాలు, నిరుద్యోగ యువతకు కమ్యూనికేషన్ నైపుణ్యాన్ని అందచేయటం, అంతగా చదవని వారికి కంప్యూటర్ విద్య, పేదపిల్లలకు చదువు చెప్పించడం, పండుగలలో పాల్గొనటం, సాంస్కృతిక కార్యక్రమాలు, శారీరక వ్యాయామము, పరుగులు, నడక క్లబ్బులు వగైరాలు, ఈ–అక్షరాస్యత ప్రచారం.

***పండుగలు***

ప్రస్తుతం పండుగలు జనసమీకరణకు కేంద్రాలుగా మారుతున్నాయి. మనం మూఢవిశ్వాసాలను వ్యాపింప చేయనప్పటికీ పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడేచోట మనం కూడా వుండి వారితో సంబంధాలు పెట్టుకుని వారిని ప్రభావితం చేయాలి. వివిధ తరగతుల వారికి పోటీలు ఏర్పాటు, భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయటం, వైద్యశిబిరాలు, క్రీడా కార్యకలాపాలు, స్వచ్ఛంద సేవ, తాగునీరు సరఫరావంటి కార్యక్రమాలను చేపట్టాలి.

***సేవా కార్యకలాపాలు***

ఏవైనా విపత్తులు సంభవించినపుడు మనం ప్రజలతో వుండాలి. వైద్యశిబిరాలను, న్యాయసలహా కేంద్రాలను ఏర్పాటు చేయటానికీ, నిర్వహించటానికీ మనం తోడ్పడాలి. పాఠశాల విద్యను పూర్తిచేసిన విద్యార్థులకు న్యాయ, వైద్య రంగాలలో ప్రాథమిక శిక్షణను యివ్వాలి, అలా యివ్వగలిగితే 1950ల నాటి కమ్యూనిస్టు వుద్యమం రోజుల్లో వలెనే వారు ప్రజలకు యితోధిక సహాయాన్ని అందించగలరు.

***సహకార సంఘాలు***

సహకార సంస్థలను నడపాలి. మనం యిలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించాలి. పురోగామి వ్యక్తులు, బృందాలు వీటిని నడపాలి

***సామాజిక మాధ్యమం***

సామాజిక మాధ్యమంలో మనం చురుకుగా వుండాలి, కేవలం పార్టీ వార్తలకే పరిమితంకాక వేర్వేరు బృందాలను ఏర్పాటుచేయాలి. మనం కేవలం సైద్ధాంతిక, రాజకీయదాడులకు మాత్రమే ప్రతిస్పందించటంకాక, మన సిద్ధాంతాన్ని సృజనాత్మక రీతిలో ముందుకు తేవాలి. మనం ఏర్పాటు చేసే సామాజిక మాధ్యమ బృందాలు కార్యాచరణ బృందాలుగా మారతాయి.

***పార్టీ చొరవ గురించి***

1990ల నుంచీ మనం నయా వుదారవాద విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాము. అలానే విద్య, వైద్యం యితర సర్వీసులను ప్రైవేటీకరించటాన్ని కూడా వ్యతిరేకిస్తున్నాము. నాణ్యమైన సేవలను కోరే ప్రజలను వుదారవాద విధానాలు దెబ్బతీస్తున్నాయి. ఎందుకంటే వాటి వ్యయాన్ని వారు భరించలేకపోతున్నారు. వారి ఆకాంక్షలను వ్యక్తం చేసేందుకువున్న అవకాశాలను మనం పోగొట్టుకున్నాము. కచ్చితమైన నినాదాలను యివ్వలేకపోయాము. మనం మధ్యతరగతిని నిర్లక్ష్యం చేశామన్న అభిప్రాయం మన పార్టీలోనూ, మన మద్దతుదారుల్లోనూ వున్నది. మనకూ, యిప్పటి నూతన తరానికి మధ్య అపారమైన అంతరమే వున్నది.

మనం కలగచేసుకోని కొన్ని అంశాలు లేదా చాలినంతగా జోక్యం చేసుకోని అంశాలు యీ విధంగా వున్నాయి:

✶ ఇంజనీరింగ్, మెడికల్ తదితర వృత్తి విద్యాసంస్థలలోకి ప్రవేశించే ప్రణాళిక మనకింకా లేదు.

✶ ఫ్రీ సాఫ్ట్‌వేర్ ఉద్యమం ద్వారా ఐటిలో ప్రవేశించే అవకాశం వున్నప్పటికీ మనం తగినంతగా దృష్టిని కేంద్రీకరించలేదు.

✶ ధనికులు మరింత ధనికులుగా మారుతున్న క్రమంలోనే పేదలు కూడా క్రమక్రమంగా ఆస్తిపరులు అవుతారన్న సిద్ధాంతాన్ని (ట్రికిల్–డౌన్ థియరీ) మనం సైద్ధాంతికంగా వ్యతిరేకించినప్పటికీ దానిని పూర్తిగా అర్థం చేసుకోలేక పోయాము. కనుక మన డిమాండులు మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలకు సరితూగలేక పోయాయి.

✶ మనం అవినీతిని తీవ్రంగా వ్యతిరేకించాము. అవినీతి అనేది నయా వుదారవాద వాదంతో వచ్చినదన్న అర్థాన్ని మన వైఖరి యిచ్చింది. అవినీతి వ్యతిరేక పోరాటంలో నిర్మాణాత్మకంగా పాల్గొనకుండా యీ ధోరణి మనలను నిరోధించింది.

దీనితోపాటే భారతదేశంపట్ల ప్రతికూల వైఖరి తీసుకున్నట్లయింది. ఇది మనలను యువతకు దూరం చేసింది.

✶ నిర్భయ ఆందోళన సమయంలో మనం స్వతంత్రంగా పాల్గొన్నప్పటికీ మొత్తం వుద్యమానికి మనం వేరుగా వున్నట్లు గోచరించింది.

✶ సామాజిక మాధ్యమం ప్రాధాన్యతను మనం సకాలంలో గుర్తించలేదు. కాగా యిప్పుడు మనం జోక్యం చేసుకోవాలనుకున్నా, దానిని సమగ్రంగా అవగాహన చేసుకున్నామని చెప్పజాలము.

నవతరాన్ని సోషలిజం వైపుకు ఆకర్షించడమే యీనాడు కమ్యూనిస్టుల ముందున్న అతిపెద్ద సవాలు, అత్యంత ప్రధానమైన కర్తవ్యం. 'సోషలిజం విఫల సిద్ధాంతం' అని విశ్వసించేలా యువతరాన్ని తప్పుదోవ పట్టించారు.

**వ్యూహాత్మక వైఖరి**

సాపేక్షకంగా చూసినట్లయితే ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులను, నిరుద్యోగులను, చిరు వుద్యోగులను, ఐటి వృత్తుల వారినీ చేరుకోవడం సులభం. అంతేకాక, వారిపై దృష్టి పెట్టవలసిన అవసరం ఎంతైనా వున్నది, ఎందుకంటే వారు ఆధునిక పద్ధతులను ఆకళింపు చేసుకుని వుంటారు. నిరుద్యోగము, చిరు వుద్యోగాలు, కళాశాలలు, నివాస ప్రాంతాలు వంటివాటిపై దృష్టి పెట్టవలసిన అవసరం ఎంతైనా వున్నది, వీటిని సంఘం కోసం వుపయోగించుకోవాలి. దీర్ఘకాలిక వైఖరిని చేపట్టవలసిన అవసరం వున్నది. ఇంజనీరింగ్ కళాశాలలను దృష్టిలో వుంచుకోవాలి. ఇక్కడ ప్రతిభావంతులైన విద్యార్థులే కాలక్రమంలో పారిశ్రామిక రంగంలో వుద్యోగులు కానున్నారు. నూతన శ్రమ కేంద్రాలలోకి మన ప్రవేశాన్ని సులభం చేస్తుంది. మనం గట్టిగా పనిచేశామంటే నాలుగైదు సంవత్సరాలలోనే ఫలితాలు కన్పిస్తాయి.

అనేకమంది యువతీయువకులకు నెలవుగానూ, అలానే గ్రామీణ ప్రాంతాలను ప్రభావితం చేయగల రాజకీయాలకు, ఆందోళనలకూ కేంద్రాలుగా వున్న పట్టణాలలో పునాదులు వేయడానికి పైవైఖరి వుపయోగపడుతుంది. పట్టణ సమస్యలపై పార్టీ కేంద్రం శాశ్వత అధ్యయన కేంద్రం వుండాలి.

**సంఘనిర్మాణ రూపాలు, పద్ధతులు**

సంప్రదాయ పద్ధతులకు ఆకర్షితులుకాని వృత్తి నిపుణులను రాబట్టటం కోసం ప్రజాస్వామ్య తరహా పని విధానాన్ని అనుసరించవలసి వుంటుంది. ప్రస్తుతమున్న ప్రజాసంఘాలలోకి వారిని చేర్చలేము, కనుక, నూతన రంగాల అవసరాలకు, సమస్యలకు తగిన విధంగా సరికొత్త సంఘరూపాలను కనిపెట్టవలసి వుంది. నూతన సంఘాలను, వేదికలను తాత్కాలిక ప్రాతిపదికపై సృష్టించవలసి వుంటుంది.

ఫ్రీ సాఫ్ట్‌వేర్ వుద్యమాలను మనం ప్రోత్సహించాలి. ఐటి వుద్యోగులను తదితరులను సంఘటితపరిచే వేదికగా యిది వుండగలదు. ఇందుకుగాను తగిన కేడర్‌ను మనం నియమించాలి, దీనితోపాటే ఇంజనీరింగ్ కళాశాలలపై దృష్టిని కేంద్రీకరించాలి.

ఈ కార్యానికిగాను కేడర్‌ను అభివృద్ధి చేసుకోవటం అత్యంత అవసరం. ఉద్యోగ విరమణ చేసిన వారినీ, వుద్యోగులను, మన కామ్రేడ్స్ పిల్లలను మనం వుపయోగించుకోవాలి. మధ్యతరగతి వారిలో సాంస్కృతిక వుద్యమాన్ని నిర్మించవలసి వుంది. పండుగల్లోనూ, వుత్సవాలలోనూ మనం పాల్గొనాలి. మనం పౌర వేదికలను స్థాపించాలి, లేదా ప్రస్తుతమున్న వాటిలో చేరి పట్టణ పౌరులకు సంబంధించిన వివిధ విషయాల్లో జోక్యం చేసుకోవాలి. నివాస సంక్షేమ సమాఖ్యలలో మనం చురుకుగా పాల్గొనాలి. పట్టణ మురికి వాడల్లో నివసించే పేదలను సంఘటితపరచడానికిగాను మనం పలు వేదికలను సృష్టించాము.

పర్యావరణ కాలుష్యం, వినియోగం, పిల్లల సమస్యలపై మనం తప్పనిసరిగా చర్చావేదికలను నిర్వహించాలి. సాంస్కృతిక, క్రీడా వుత్సవాలను నిర్వహించాలి.

ప్రజల చైతన్యస్థాయికి తగిన విధంగా నినాదాలను, పిలుపులను రూపొందించుకోవాలి. సమస్యలపై మనం సమరశీలమైన, నిలకడైన పోరాటాలను సాగించాలి, అలాచేసినట్లయితే పార్టీపై ప్రజల విశ్వాసం పెరుగుతుంది.

**నూతన పనిపద్ధతుల గురించి కేడర్‌కు తిరిగి శిక్షణ యివ్వాలి**

నయా వుదారవాదం ముందుకు తీసుకువచ్చిన నూతన సవాళ్ళను ఎదుర్కొనేలా మన కేడర్ పునర్వ్యవస్థీకృతం కావాలి. పట్టణ ప్రాంతాలపైనా, నూతన మధ్యతరగతిపైనా దృష్టిని కేంద్రీకరించవలసిన అవసరం ఎంతైనా వున్నది. రెండు విధాలైన వైఖరిని అనుసరించాలి. ఒకవైపున, వివిధ సమస్యలపై పార్టీ తన వైఖరిని బహిరంగంగా వెల్లడించాలి. మరోవైపున వివిధంగా వున్న సమాఖ్యలతోనూ, సంఘాలతోనూ మనం పనిచేయాలి.

స్థానిక పోరాటాలలో నాయకత్వం నేరుగా పాల్గొనాలి. ఇది మన కేడర్‌లో వుత్సాహాన్ని నింపుతుంది. మనం మాట్లాడే తీరు, మన భాష, మన ప్రచారసామాగ్రి తీరు, దానిలో వుపయోగించే భాష అన్నీ మారాలి. మన భావజాలాన్ని వ్యాప్తిలోకి తీసుకువచ్చే క్రమంలో తప్పనిసరిగా మనం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, కమ్యూనికేషన్ పద్ధతులను వుపయోగించుకోవాలి. స్మార్ట్‌ఫోన్‌లు ప్రధానమైన సాధనాలుగా వుంటాయి. మధ్యతరగతిపై వామపక్ష భావాల ప్రభావాన్ని పెంచటానికి మనం నిరంతరం కృషిచేయాలి.

**కార్మికవర్గ కర్తవ్యాలు**

ఉద్యమాలను నిర్మించటం, అన్ని వుద్యమాలలోనూ పాల్గొనటం, నయా వుదారవాదానికి వ్యతిరేకంగా వివిధ రీతులలో పోరాడే మధ్యతరగతికి మద్దతు యివ్వటం కార్మికవర్గం యొక్క కర్తవ్యం. పనిస్థలాల్లో పోరాటాన్ని సాగిస్తూనే, నివాస ప్రాంతాలలో సైతం మధ్యతరగతితో కలసి ప్రభుత్వమూ, మార్కెట్ శక్తులు సాగించే వివిధ దోపిడీ రూపాలకు వ్యతిరేకంగా కార్మికవర్గ నాయకులు పోరాడాలి.

# సూచనలు - సిఫార్సులు

1. మధ్యతరగతికి ఎదురవుతున్న ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమస్యలపై జోక్యం చేసుకోవటం ద్వారా మాత్రమే వారిలో ప్రచలితమై వున్న ధోరణులతో పోరాడగలము, పురోగామి మార్గంలో సాగగలము.
2. ప్రత్యామ్నాయ నినాదాలు, నూతన సంఘనిర్మాణంతో కూడిన నూతన వైఖరితో మాత్రమే నూతన మధ్యతరగతిలోకి చొరపడగలము. మన కార్యకలాపాలలో సాధారణ యువత పాల్గొనాలంటే ప్రజాతంత్ర పనివిధానం ప్రాథమికమైన షరతు. నూతన మధ్యతరగతితో కలవాలంటే మనం వేదికలను నిర్మించటంతోపాటు, నూతన సంఘరూపాలను కూడా స్వీకరించాలి.
3. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన స్థానిక సమస్యలపై పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వం స్పందించాలి.
4. ప్రధానమైన స్థానిక పోరాటాలలో కిందనుంచి పైస్థాయి వరకు వున్న నాయకత్వం చురుకుగా పాల్గొనాలి. జాతీయ అంశాలపై స్థానికస్థాయిలో పెద్ద నాయకులు పాల్గొన్నట్లయితే జాతీయోద్యమంలో వలెనే అజెండా ముందుకు వస్తుంది.
5. కేంద్ర సంఘంగా వుండేలా నూతన పట్టణ సంఘటనను ఒకదానిని అన్ని రాష్ట్రాలలోనూ, ఆ తరువాత జాతీయ స్థాయిలోనూ స్థాపించాలి. కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయం కోసం వెనువెంటనే పార్టీ కమిటీలు ఏర్పడాలి.
6. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మన మధ్యతరగతి సంఘాలను, పార్టీ కేడర్‌ను పునర్నిర్మించుకోవాలి. ప్రస్తుతమున్న సంఘాలు తమ పనితో సంబంధమున్న తరగతులకు సమర్థవంతంగా సేవలందించటంతోపాటు, తమ ప్రభావాన్ని విస్తరింపచేయాలి. ఉదాహరణకు, వుపాధ్యాయులైన వారు విద్యార్థులకు మార్గదర్శకాలను రూపొందించాలి.

7. నూతన మధ్యతరగతిలో వివిధ స్థాయిలో పనిచేసేందుకుగాను తగినంతమంది కేడర్‌ను కేటాయించటంతో పాటు, నిర్మాణపరమైన ఏర్పాట్లను చేయాలి.
8. మన పార్టీ, ప్రజాసంఘాల పత్రికల ద్వారా, ప్రసారమాధ్యమం, వెబ్‌సైట్లద్వారా సైద్ధాంతిక పోరాటం చేయాలి.
9. అధ్యయన తరగతులు, తదితర సాధనాల ద్వారా సమకాలీన అంశాలపై కేడర్‌ను సాయుధం చేయటం.
10. ప్రాంతీయ భాషల్లో వేర్వేరు అంశాలపై సాహిత్యాన్ని ప్రచురించడం. ఇందుకుగాను కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ ప్రచురణ సంస్థలను పటిష్టం చేయాలి.
11. జన సమీకరణకు కేంద్రకాలుగా వుపయోగపడే వివిధ వేదికల నుండి సామాజిక మాధ్యమానికి చెందిన బృందాలను బలోపేతం చేయాలి.
12. కళాకారులు, చిత్రకారులు, నటులు, సంగీతకారులు వగైరాల ఆధునిక సాంస్కృతిక వేదికలను ప్రోత్సహించాలి.
13. వివిధ రంగాలలో పనిచేసే యువ కేడర్‌ను గుర్తించి వారికి రాజకీయ, నిర్మాణ, కమ్యూనికేషన్ నైపుణ్యంలో శిక్షణ యివ్వాలి.

*(ఏప్రియల్, 2016 నుంచి జూన్, 2016 వరకు నిర్వహించిన అధ్యయనం నివేదిక)*

**అధ్యయన బృందం సభ్యులు**

వి. శ్రీనివాసరావు (కన్వీనరు)
అశోక్ భట్టాచార్య
శ్రీదీప్ భట్టాచార్య
డా.స్మితా గుప్తా
డా.థామస్ ఐజక్
కిరణ్.


**ప్రతులు : 2000**
**ప్రచురణ కాలం : జనవరి, 2018**
**వెల : ₹ 15/-**

132436

**ప్రచురణ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ**

*27-13-3, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, ఆకుల వారి వీధి,*
*గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ నెం. 0866 2577202, 9490098042*